ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 16 అక్టోబరు 2025 | 7



వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో ఆకర్షణగా కేరళ కథాకళి నృత్యం.. (పక్కన) చంద్రప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు దృశ్యం





సమ్మోహినీ రూపుడై...

సూర్య ప్రభ, చంద్ర ప్రభ వాహనాలపై తిరు వీధుల్లో విహరించిన శ్రీవారు

వాడపల్లిలో ఆరో రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు 8

దొరికారు!

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ తహశీల్దార్, డేటా ఆపరేటర్

భూమి సర్వే కోసం రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ రైడ్

కార్యాలయ సోదాల్లో అదనంగా రూ.5.85 లక్షల నగదు స్వాధీనం 9

లంచాల 'రెవెన్యూ'.. అదే మహా 'ప్రసాదం'



- మొయినీలో

తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము

'ఆయుర్వేదం' ఆగయా!



- కాకినాడకు ఆయుర్వేద కాలేజీ మంజూరు చేసిన కేంద్రం
- రూ.16 కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్న ఆయుష్ శాఖ
- జీపీటీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 50 పడకల ఆసుపత్రిలోనే ఏర్పాటు
- అక్కడే కాలేజీ నిర్మాణానికి రెండెకరాలు కేటాయించాలని కోరిన కేంద్రం
- 8 స్పెషాలిటీ కోర్సుల్లో 50 సీట్లతో మొదలుపెట్టి 100 సీట్ల వరకు అప్‌గ్రేడ్
- ఆయుర్వేద కాలేజీ రాకతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు ఎంతో మేలు
- ప్రస్తుతం రాష్ట్రంలో తిరుపతి, విజయవాడలోనే ఆయుర్వేద కళాశాలలు

కాకినాడ సిగలో మరో వైద్య కళాశాల అందుబాటులోకి రాబోతోంది. ఆయుర్వేద వైద్యానికి డిమాండ్ నెలకొన్న తరుణంలో కాకినాడలో ఆయుర్వేద కాలేజీని మంజూరు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ విభాగానికి సమాచారం అందించింది. రూ.16 కోట్ల వరకు ఖర్చయ్యే కాలేజీ ఏర్పాటుకు రెండెకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కోరింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు ఎంతో మేలు జరగనుంది. ఎంబీబీఎస్ తరహాలోనే నీట్ ద్వారా ఆయుర్వేద కాలేజీలకు అడ్మిషన్ లభిస్తుంది.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఆయుర్వేద వైద్యానికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. అనేక ముదిరిపోయిన వ్యాధులను సైతం నయం చేస్తుందనే ప్రచారం దీనికి ఉంది. ఈనేపథ్యంలో దేశంలో వేల ఏళ్ల కింద ఉద్భవించిన ఈ వైద్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయుర్వేద ఆసుపత్రులు, కాలేజీలను నిర్వహిస్తోంది. అనేక రకాల వ్యాధులకు ఆయుర్వేద ఆసుపత్రుల్లో ఉచితంగా, నామ మాత్రపు రుసుములతోను చికిత్సలు అందిస్తున్నారు. అందులోభాగంగా కాకినాడకు సైతం ఆయుర్వేద ఆసుపత్రిని కేంద్రం మంజూరుచేసింది. రూ.17 కోట్లతో దీన్ని కాకినాడ జీపీటీ ఆవరణలో 50 పడకల సామర్థ్యంలో నిర్మించారు. ఇక్కడ హోమియో, యోగా, యునానీ, ఆయుర్వేద చికిత్సలు అందించేలా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా నిర్మాణం పూర్తి చేశారు. అయితే దీనికి అవసరమైన వైద్యుల నియామకం పూర్తి కాకపోవడంతో ఇంకా ఇది ప్రారంభం కాలేదు. అయితే ఉమ్మడి జిల్లాకు ఆయుర్వేద కాలేజీ అవసరాన్ని గుర్తించి గతేడాది కూటమి ప్రభుత్వం రాగానే అధికారులు కేంద్రానికి ప్రతిపాదన పంపించారు. కొత్తగా ఆయుర్వేద మెడికల్ కాలేజీలను మంజూరు చేసే అవకాశం ఉండడంతో కాకినాడకు కొత్త కాలేజీ ఇవ్వాలని ప్రతిపాదనల్లో వివరించారు. పైగా ఇక్కడే 50 పడకల ఆయుర్వేద ఆసుపత్రి కూడా ఉన్నందున కాలేజీ కేటాయిస్తే బోధనాసుపత్రిగా ఉపయోగపడుతుందని వివరించారు. అటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కూడా కేంద్రంలో పలుదఫాలుగా మాట్లాడారు. ఈనేపథ్యంలో అనేక ఉత్తర ప్రత్యుత్తరాల అనంతరం ఎట్టకేలకు కేంద్రం కాకినాడకు ఆయుర్వేద మెడికల్ కాలేజీ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఆయుష్ విభాగం అధికారులకు తాజాగా సమాచారం అందించింది. ఈ కాలేజీ మంజూరైన నేపథ్యంలో కేంద్రం నుంచి రూ.16 కోట్ల వరకు నిధులు మంజూరవనున్నాయి. తొలి విడత కింద రూ.7కోట్ల వరకు ఇవ్వనుంది. అయితే ఈ కాలేజీకి నిర్మించాలంటే రెండెకరాల స్థలం అవసరం. అయితే ప్రస్తుతం నిర్మించిన ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలోనే ఈ భూమి కావాలని కేంద్రం కోరుతోంది. ఈనేపథ్యంలో రెండెకరాల కేటాయింపునకు జిల్లా కలెక్టర్‌ను త్వరలో రాష్ట్ర ఆయుష్ అధికారులు కోరనున్నారు. కాలేజీ, ఆసుపత్రి ఒకే చోట ఉండాల్సిన అవసరాన్ని వివరించనున్నారు.

ఎన్ని ఉపయోగాలో...

ఆయుర్వేద కాలేజీలు రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరుపతి, విజయవాడలో ఉన్నాయి. ఇప్పుడు మూడో కాలేజీ కాకినాడకు మంజూరు చేశారు. అయితే రాజమహేంద్రవరంలో హోమియో కాలేజీ ఉంది. కాకినాడలో ఆయుర్వేద మెడికల్ కాలేజీని కేంద్రం ఏర్పాటు చేస్తోంది. ఈ కాలేజీకి తొలుత యాభై సీట్ల వరకు కేంద్రం అనుమతి ఇచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆ తర్వాత వంద సీట్లకు అప్‌గ్రేడ్ చేసే అవకాశం ఉంది. అచ్చం ఎంబీబీఎస్ తరహాలోనే ఆయుర్వేద మెడికల్ కాలేజీలో సీటు కోసం నీట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. కొత్తగా ఏర్పాటుకానున్న ఆయుర్వేద కాలేజీలో ఎనిమిది వరకు స్పెషలిస్ట్ విభాగాల్లో ఆయుర్వేద విద్యను బోధించనున్నారు. ప్రధానంగా కాయ, శల్యతంత్రం, ప్రసూతి, బాలరోగి, సంహిత, పంచకర్మ, అనాటమీ, ఫిజియాలజీ విభాగాల్లో నాలుగున్నరేళ్ల ఆయుర్వేద విద్యను బోధిస్తారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమి కేటాయింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే టెండర్లు పిలిచి కాలేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఇదిలాఉంటే కాకినాడలో నిర్మాణం కానున్న ఆయుర్వేద కాలేజీ, అనుబంధ ఆసుపత్రి వల్ల ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో అనేకమంది రోగులకు వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం అనేకమంది మొండి వ్యాధులు, ఇతర అనారోగ్యాలకు ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఖర్చు తక్కువ, మంచి ఫలితాలు ఉండడంతో ఆయుర్వేద చికిత్స అందించే పలు ప్రైవేటు ఆసుపత్రులకు సైతం గిరాకీ అధికంగా ఉంటోంది. ఈనేపథ్యంలో కాలేజీ రాకతో అనేకమందికి అతి తక్కువ ఖర్చుతో అనేక దీర్ఘకాలిక, చిన్న చిన్న అనారోగ్యాలకు సైతం చికిత్స అందనుంది.

కాకినాడలో కొత్తగా నిర్మించిన ఆయుర్వేద ఆసుపత్రి





కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాహుల్‌మీనా.. (ఫైన) కలెక్టర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

ఆర్ఎంసీ కమిషనర్‌గా రాహుల్ మీనా బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా రాహుల్‌మీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన కార్యాలయం ఆవరణలోని అభయ కనకదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యాలయంలోని తన చాంబర్‌కు చేరుకుని కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్‌మీనా మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గోదావరి పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తామన్నారు. అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్ రాహుల్ మీనా స్వస్థలం రాజస్థాన్. ఆయన తండ్రి రామ్‌కిషన్ ఐఆర్ఎస్‌గా చేశారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాహుల్‌మీనాను రాష్ట్ర ప్రభుత్వం రాజమహేంద్రవరం కమిషనర్‌గా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాను నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ ఇన్చార్జి రీటా, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండీ అబ్దుల్‌మాలిక్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌మీనా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు జీజీహెచ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం రాజమహేంద్రవరం జీజీహెచ్ ఉన్నతాధికారులు, అన్ని వైద్య విభాగాల హెచ్‌వోడీలతో శాఖలు, పథకాలవారీగా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఎంసీహెచ్ బ్లాకులోని క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో ఈ సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా కలెక్టర్ శాఖలవారీగా సంబంధిత అధికారులతో సమీక్ష చేస్తారు. సమస్యలు అడిగి తెలుసుకుంటారు. పరిష్కారానికి మార్గనిర్దేశనం చేస్తారు. మెడికల్ కాలేజీ పనులపైనా సమీక్షిస్తారు. మొత్తం 18 అజెండా పాయింట్లను కలెక్టర్ సమీక్ష చేసే అవకాశం ఉంది. పల్మనాలజీ, రేడియాలజీ, సీటీ స్కాన్ విభాగం, ఎన్టీఆర్ వైద్యసేవలో ఇన్‌పేషెంట్ రోగుల వివరాలు, ఎస్ఎన్‌సీయూ తదితర విభాగాల పనితీరుతోపాటు క్రిటికల్ కేర్ బ్లాకు పనుల పురోగతి, ఆన్ గోయింగ్ పనులు సమీక్షిస్తారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ బుధవారం హెచ్ఓడీలు, సంబంధిత వైద్యాధికారులకు అత్యవసర సర్క్యులర్ జారీచేస్తూ అన్ని వివరాలతో హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చారు.

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను పండించాలి

- కలెక్టర్ కీర్తి చేకూరి



దొమ్మేరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి

కొవ్వూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి, ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను పండించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతు నుంచి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ఎక్కడైన సంస్కరణలు తొలి అడుగుతో సాధ్యం అవుతుందన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో రైతు నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 12 ఎకరాల్లో అరటి, చెరకు, బొప్పాయి, పసుపు, కంద, డ్రాగన్‌ఫ్రూట్, జామ తోటలను సాగుచేయడం అభినందనీయమన్నారు. జిల్లా మొత్తం 43 వేల ఎకరాల్లో 2300 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. అలాగే 18 డ్రోన్ టెక్నాలజీతో 7800 మంది రైతులు 10,600 ఎకరాల్లో కషాయాలు స్ప్రే చేస్తూ పురుగుల మందుల వినియోగాన్ని తగ్గిస్తున్నారన్నారు. ఆవుపేడ, మూత్రం ద్వారా జీవామృతం తయారీ, మల్చింగ్, లింగాకర్షణ బుట్టల వాడకం పద్ధతులను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా ఉద్యానవన అధికారి ఎన్.మల్లికార్జునరావు, హెచ్‌వోడీ డి.సుధీర్‌కుమార్, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం బి.తాతారావు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో మంత్రి దుర్గేష్, ఐఏఎస్ ఆమ్రపాలి

ఉదయ్‌పూర్ పర్యాటక మీట్‌కు మంత్రి దుర్గేష్ హాజరు

నిడదవోలు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తిరుపతి, విశాఖపట్నాలను త్వరలోనే ప్రపంచ పర్యాటక గమ్యస్థానాలుగా అభివృద్ధి చేస్తామనే కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ హామీ లభించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉదయపూర్‌లో అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల పర్యాటకశాఖ మంత్రులతో రెండోరోజు బుధవారం సమావేశం జరిగింది. దీనికి హాజరైన మంత్రి దుర్గేష్ 'ఆంధ్రజ్యోతి'తో అక్కడి విశేషాలను ఫోనులో చెప్పారు. రాజమండ్రిలో నేషనల్ స్కూల్‌డ్రామా ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రిని కోరినట్టు తెలిపారు.



ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ సమ్మిట్-2025 పోస్టర్ విడుదల

రాజమహేంద్రవరంరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్టణం ఆంధ్రా విశ్వవిద్యాలయంలో 'ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2025' జరగనుందని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ తెలిపారు. ఇండస్ట్రియల్ పార్టనర్ షిప్ సమ్మిట్-2025 పోస్టర్‌ను ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ మార్ని వాసుదేవరావు, డీజెడ్ఎం అసెట్ మేనేజర్, డీజెడ్ఎంఈ మేనేజర్ తదితరులతో కలసి జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ నుంచి నవంబరు 15వ తేదీ వరకు చేపట్టవలసిన ఏపీఐఐసీ పరిశ్రమ భాగస్వామ్య డ్రైవ్, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పెట్టుబడి ప్రోత్సాహం డ్రైవ్, ప్లాంటేషన్ డ్రైవ్, పారిశుద్ధ్యం, పరిశుభ్రత డ్రైవ్ తదితర కార్యక్రమాలపై చర్చించారు.

బతుకు చెదిరి.. గూడు వదిలి..





- నగరంలో పెరుగుతున్న నిరాశ్రయులు
- ఇంట్లో పొసగక వీధి బాట
- జీవనోపాధి చేసుకుంటూ కొందరు..
- మరికొందరు యాచకం మాటున నేరాలు
- జిల్లాలో 500 మందికిపైగా రోడ్లపైనే జీవనం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓ వ్యక్తిపేరు ప్రసాదు. నెల్లూరు నుంచి రాజమహేంద్రవరం వచ్చాడు. రాడ్‌బెండింగ్ పని బాగా వచ్చు. ఇంట్లో పొసగక వీధి బాట పట్టాడు. ఇక్కడ పగలు పనికి వెళ్లి రాత్రి వేళల్లో ఫుట్‌పాత్‌లను ఆశ్రయిస్తున్నాడు. ఇలా పేదరికం.. అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులు.. ఉపాధి వెతుక్కుంటూ.. ఇంట్లో సమస్యలు.. ఎవరూ లేని ఒంటరితనం.. వ్యసనాలతో అయినవాళ్లకు దూరం.. చట్టం నుంచి తప్పించుకొని.. ఇలా కారణాలేమైనా రోజు రోజుకూ గూడును వదిలి రోడ్డును నమ్ముకొని బతుకులను బరువుగా ఈడుస్తున్న జీవితాలు పెరిగిపోతున్నాయి. రోడ్డు సెంటర్ డివైడర్లు, షాపులు మూత వేసిన తర్వాత అరుగులు, రేవులు, ప్లాట్‌ఫాంలే పరుపులుగా బహిరంగ ప్రదేశాలే నివాసాలుగా ఊపిరిని నిలుపుకొంటున్నారు. భార్యాబిడ్డలు ఉండి కొందరైతే.. ఎవరూలేక మరికొందరు.. అలనాపాలనా చూసేవారు లేక ఇంకొందరు రోడ్లబాట పడుతున్నారు. ఈ సమస్య సామాజికపరంగా ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కొన్ని పరిస్థితుల్లో భార్యాబిడ్డలు ఎంత వెతుకుతున్నా వీళ్ల ఆచూకీ లభించని కేసులు కూడా ఉన్నాయి. ఇక రాజమహేంద్రవరంలో నిరాశ్రయుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతం, పుష్కర్‌ఘాట్, గోదావరి గట్టు, రైల్వే స్టేషను తదితర చోట్ల నిరాశ్రయులు ఉంటున్నారు. వీళ్లలో చాలామంది ఇతర రాష్ట్రాలకు చెందిన వాళ్లు ఉంటారు. భవన నిర్మాణం, పెయింటింగ్, కేటరింగ్ వంటి పనులు చేసుకుంటూ ఉంటున్న వాళ్లు డబ్బులు కాస్త జమ అయిన తర్వాత ఇళ్లకు వెళ్లి వస్తుంటారు. పుణ్యం కోరుకుంటూ ప్రతి రోజూ ఉదయం టిఫిన్ దగ్గర నుంచీ రాత్రి భోజనం వరకూ.. సీజనల్ ఫ్రూట్స్ నుంచి ఈవెనింగ్ స్నాక్స్ వరకూ దాతలు వీరి వద్దకే పట్టుకొచ్చి ఇస్తున్నారు. ఇది హర్షించదగినదే అయినా అధికశాతం మంది ఈ ఉచితాలకి అలవాటుపడి ఏ పనీ చేయకుండా నేరాలకు అలవాటు పడుతున్నారు. నిరాశ్రయుల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు లేదా వారి స్వగ్రామానికి పంపించడానికి పోలీసులకు చేతి చమురు వదులుతోంది. ఈ తంతుకు దాతలు ఎవరూ ముందుకు రావడం లేదు. కొందరు నేరాల బాట పడుతున్నారు. గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. తిండి ఎలాగూ దొరుకుతోంది, పగలంతా యాచించగా వచ్చిన సొమ్ముతో మద్యం తాగుతూ జల్సా చేస్తున్నారు. ఆ మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఘాట్లలో స్నానాలకు వెళ్లిన వాళ్ల బ్యాగులు, సెల్‌ఫోన్లు దొంగిలించడం, ద్విచక్ర వాహనాలు పట్టుకుపోవడం చేస్తున్నారు. ఈ పరిస్థితి పోలీసులకు తలపోటుగా మారింది. వాళ్ల వివరాలు ఎక్కడా నమోదు కాకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగడం లేదు. ఇక్కడ దొంగతనాలు చేసి వేరే ఊళ్లకు వెళ్లిపోతున్నారు. ఇప్పటికే తమపై కేసులు ఉన్నవాళ్లు కూడా నిరాశ్రయుల మాటున చట్టాన్ని తప్పించుకొని తిరుగుతున్నారు. మూడు రోజుల నుంచీ పోలీసులు స్పెషల్ డ్రైవ్ పెడితే ఆశ్చర్యపోయే విషయాలు బయటకు వచ్చాయి. నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్నవాళ్లు, దొంగతనం కేసుల్లోని వాళ్లే కాకుండా మర్డర్ కేసుల్లోని వాళ్లు కూడా ఉన్నారని తెలిసింది. దీంతో పోలీసులు కౌన్సెలింగ్ మొదలు పెట్టారు. ఇప్పటివరకూ 400 మంది నిరాశ్రయులను గుర్తించి వివరాలు తెలుసుకోగా వాళ్లలో 21 మంది పోలీస్ కేసుల్లో ఉన్నవాళ్లు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ పట్టణ జీవనోపాధుల పథకం (మెప్మా) కింద పట్టణ నిరాశ్రయుల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. రాజమహేంద్రవరంలోని పునరావాస కేంద్రాన్ని ఓ స్వచ్ఛంద సంస్థకు నిర్వహణ అప్పగించారు. రాత్రి భోజన ఏర్పాటు ఉంది. ఈ కేంద్రంలో 50 మంది వరకూ ఆశ్రయం పొందే వీలుంది. అయితే నగరంలో కనీసం 400 మంది నిరాశ్రయులు రోడ్లపై ఉన్నారు. కనీసం వీరు పునరావాస కేంద్రంలో ఉంటే కొంతైనా నేరాల సంఖ్య తగ్గుతుంది.



రామహేంద్రవరంలో నిరాశ్రయుల వసతి కేంద్రం

యాచకం మాటున నేరాలు

నిరాశ్రయులు, యాచకుల మాటున నేరస్తులు ఉండడం ఆందోళన కలిగించే అంశం. దీనిపై ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. మా సోదాల్లో ద్విచక్ర వాహనాల దొంగ, హత్యాయత్నం కేసులు ఉన్నవాళ్లని గుర్తించాం. ఆయా పోలీస్ స్టేషన్లకు అప్పగించాం. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్లు, నిరుద్యోగులు వంటి వారిని కౌన్సెలింగ్ చేసి వారి స్వగ్రామాలకు పంపించాం.

- ఎస్పీ నరసింహ కిషోర్

ఏపీ ఉమ్మడిగా ఉంటేనే బాగుండేది..



కలిసున్నప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి 9

కొడుకులను కడతేర్చి.. తానూ అంతమై..



పావులూరి కామరాజు, కుమారులు అభిరామ్, గౌతమ్

- ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి
- చిలకలపాడులో దారుణం 9

చిరు ప్రా ధాన్యం





(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మంచి ఆహారపు అలవాట్లు, నిత్య వ్యాయామం మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయి. కాలానుగుణంగా జీవనశైలిలో వస్తున్న మార్పులతో ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయి. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా వేధిస్తున్న దీర్ఘకాలిక వ్యాధుల నుంచి తప్పించుకునేందుకు ప్రత్యేక ఆహారంపై ఆధారపడుతున్నారు. రెగ్యులర్ రొటీన్ ఫుడ్‌ను పక్కనపెట్టి.. సంప్రదాయ ఆహార అలవాట్ల దిశగా అడుగులు వేస్తున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రత్యేక నియమ, నిబంధనలు పాటిస్తూ ఆరోగ్యానికి మేలు చేసే పౌష్టికాహారాన్నే తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా యువత ముందు జాగ్రత్తగా... ఎటువంటి రోగాలూ తమ దరిచేరకుండా ఆహారంలో మార్పులు చేసుకుంటున్నారు.

- మారుతున్న ఆహారపు అలవాట్లు
- నగరాలు, పట్టణాల్లో పెరిగిన మిల్లెట్స్ సంస్కృతి
- సహజసిద్ధమైన పోషక విలువలతో కూడిన ఫుడ్‌పై ఆసక్తి
- ఉదయాన్నే సేవిస్తున్న యువత

జిల్లాలోని కాకినాడ నగరంతో పాటు పలు పట్టణాల్లో చాలా మంది అన్నం, అల్పాహారం, ఇతర చిరుతిళ్లకు బదులుగా చిరుధాన్యాలతో తయారుచేసే వంటకాలు తినేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. దాంతో పట్టణాలు, పల్లెల్లో క్రమంగా భోజన, అల్పాహారశాలల మాదిరిగానే రాగి జావ, మొలకలు, పళ్ల సలాడ్‌లు విక్రయించే దుకాణాలు బాగా విస్తరిస్తున్నాయి.



కాకినాడ నగరంలోని వివేకానంద పార్కు చుట్టుపక్కల, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జేఎన్టీయూ, జిల్లా క్రీడా మైదానం సమీపాల్లో ఈ దుకాణాలను ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ జొన్నలు, సజ్జలు, కొర్రలు, ఓదెలు, అరికెలు, రాగులు వంటి చిరుధాన్యాల వంటకాలు, జావ తీసుకుంటున్నారు. పచ్చి కూరగాయలైన బెండకాయ, బీరకాయ, సొరకాయ, బీట్‌రూట్, కేరెట్, బూడిద గుమ్మడికాయ వంటి జ్యూస్‌లను సైతం సేవిస్తున్నారు. వాకింగ్, వ్యాయామం చేసేందుకు పార్కులు, ఇతర క్రీడా మైదానాలకు వచ్చేవారు ఈ తరహా ఫుడ్ తీసుకుంటున్నారు. కొవ్వు పదార్థాలను పూర్తిగా దూరం పెడుతున్నారు. వీటిని తీసుకునేందుకు యువకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

మన శరీరానికి ఆరోగ్యకరమైన పోషకాలను అందించే వాటిలో తృణధాన్యాలు కూడా ఒకటి. అందులో ప్రధానమైనవి రాగులు. వీటిని ఏదో ఒక రూపంలో తీసుకుంటే మంచి ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. రాగి ముద్ద, రాగి రోటీ, రాగి గంజి, అంబలి... ఇలా పలు రకాలుగా తయారు చేసుకుని తింటారు. మిల్లెట్లో కాల్షియం పుష్కలంగా ఉండడంతో ఎముకలను దృఢంగా చేయడానికి సహాయపడుతుంది. రాగులు పిల్లల శారీరక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. వృద్ధులు, మహిళల ఎముకల బలానికి మంచి మెడిసిన్ అని చెప్పాలి.

రాగి జావను రోజూ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం. రాగుల్లోని పోషకాలు...



ముఖ్యంగా ప్రొటీన్లు, విటమిన్లు, ఏ, బీ, సీ, మినరల్స్ మన శరీరానికి బలాన్ని ఇస్తాయి. దీంతో జీర్ణశక్తి పెరుగుతుంది. రాగుల్లో ఉండే అమైనో ఆమ్లాలు ట్రిప్టోఫాన్ ఆకలిని తగ్గిస్తుంది. బరువును అదుపులో ఉంచుతుంది. మిల్లెట్ పిండితో చేసిన ఆహారాన్ని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. అలాగే గుండె జబ్బులు, ఉబ్బసం వంటివి తగ్గుతాయి. రాగులు తీసుకోవడం వల్ల చర్మం, మెరుస్తూ మృదువుగా ఉంటుంది. మధుమేహాన్ని కంట్రోల్ చేస్తుంది. అలాగే రక్త హీనతను దూరం చేస్తుంది.

నగర జీవనం ఒత్తిడితో కూడినది. నిత్యం ఉరుకులు, పరుగుల మధ్య సాగుతుంది. దీనికి తోడు పిజ్జాలు, బర్గర్లు, నూడిల్స్ వంటి ఫాస్ట్ ఫుడ్ వినియోగం అధికం కావడంతో మధుమేహం, ఊబకాయం, గుండెజబ్బులు వంటి దీర్ఘకాలిక సమస్యలు ప్రస్తుతం అందరిలోనూ కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సహజసిద్ధమైన, పోషక విలువలున్న ఆహారం వైపు దృష్టిసారిస్తున్నారు. జంక్ ఫుడ్ తెచ్చిన ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు పాతకాలపు ధాన్యాలవైపు ఆశగా చూస్తున్నారు.

ముఖ్యంగా యువత హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల పేరుతో వీటిని స్టాళ్లుగా ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధిగా మార్చుకుంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీటిని విక్రయిస్తూ నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు. ప్రజలు తమ ఆహారపు అలవాట్లుగా మార్చుకున్నారని వారు చెప్తున్నారు. మొదట్లో అంతగా ఆదరించలేదు. గత ఐదేళ్లగా వినియోగదారుల డిమాండ్ పెరిగింది.



మొలకెత్తిన విత్తనాలు, నువ్వుల ఉండలు, వేరుశెనగ ఉండలు, చిక్కీలు, ఉడకబెట్టిన గుడ్లు విక్రయిస్తున్నారు.





పండ్ల రసాలే కాదు... పచ్చి కూరగాయల రసాలు కూడా...

సాధారణంగా పండ్ల రసాలను తీసుకునే వారిని చూస్తుంటాం. యాపిల్, పైనాపిల్, బత్తాయి, బనానా, ద్రాక్ష, సపోటా, బొప్పాయి వంటి జ్యూస్‌లు, మిల్క్ షేక్‌లకు ప్రాధాన్యమిచ్చే జనం ప్రస్తుతం పచ్చి కూరగాయల రసాలు సేవించేందుకు వెనుకాడడం లేదు. ఉదయాన్నే పరగడుపున బీట్‌రూట్, క్యారెట్, బూడిదగుమ్మడికాయ, కీరదోసకాయ, సొరకాయ, కాకరకాయ, బెండకాయ, బీరకాయ వంటి జ్యూస్‌లను సేవిస్తున్నారు. గ్లాస్ జ్యూస్ రూ.40 నుంచి రూ.60కి ఇక్కడ విక్రయిస్తున్నారు.

నన్నయలో ఘనంగా ఆహార మహోత్సవ్

- తొలి రోజు 'తూర్పు' ఆహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు
- నేడు 'పశ్చిమ' వంటకాల ప్రదర్శన



వంటకాలను రుచి చూస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల ప్రాశస్త్యాన్ని తెలియజెప్పేవిధంగా ఈ ప్రాంత ప్రజల వంటకాల గొప్పతనాన్ని ఇనుమడింపజేయడానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 'ఆహార మహోత్సవ్' నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయం ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఆహార పదార్థాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి నన్నయ విగ్రహానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మన వారసత్వ సంపదను, సంప్రదాయాలను, వంటకాలను, గోదావరి జిల్లాల వంటకాల గొప్పతనం తెలియజేయడమే ఈ ఆహార మహోత్సవ లక్ష్యమన్నారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా వాసులు ఆహార మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. న్యాయనిర్ణేతలుగా జిల్లా రోగనిరోధక అధికారి డాక్టర్ కోమలి, రసాయనశాస్త్రం అధ్యాపకురాలు టీబీ నళినీ, గైనకాలజిస్ట్ డాక్టర్ చందన పర్వత వర్ధినీ, సత్యదేవ నర్సరీ యజమాని శ్రీలక్ష్మీసత్యనారాయణ, యూనియన్ బ్యాంక్ నుంచి ఎస్.పుష్పలత, హాజరై ఆహార పదార్థాలను పరిశీలించారు. శాఖాహార వంటల విభాగంలో బి.ప్రశాంతిశ్రీ బృందం ప్రథమ, పి.శిరీష బృందం ద్వితీయ, కె.మమత తృతీయ బహుమతులు సాధించారు. మాంసాహార వంటల విభాగంలో బాలుర వసతిగృహం విద్యార్థులు ప్రథమ, బి.లక్ష్మి ద్వితీయ, వై.బాబి తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డి.కళ్యాణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, హైకోర్టు న్యాయవాది ఎ.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆహార మహోత్సవ్‌లో సందడిగా మారిన స్టాల్స్

జాతీయ బాక్సింగ్ పోటీలకు నిహారిక ఎంపిక



ద్రాక్షారామ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు కారుమూరి నిహారిక ఎంపికైంది. రాజమహేంద్రవరం ఎస్కేవీటీ హైస్కూలులో ఈ నెల 11 నుంచి 14 వరకు అండర్-14, 17 విభాగాల్లో 69వ శాప్ స్కూలు గేమ్స్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. సుమారు 2వేల మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో రామచంద్రపురానికి చెందిన రత్నం కిక్ బాక్సింగ్ అకాడమీ విద్యార్థిని కారుమూరి లేఖనిహారిక ఫైనల్ ఫైట్‌లో విశాఖపట్నంలోని సాయి అకాడమీకి చెందిన అమ్మాయితో తలపడి ప్రథమస్థానం సాధించి స్వర్ణ పతకం కైవశం చేసుకుందని, ఈ నెల 28న అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటుందని స్కూల్ గేమ్స్ బాక్సింగ్ అడ్మిన్ సెక్రటరీ వి.భువనేశ్వరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏవీడీ ప్రసాద్ పేర్కొన్నారు.





శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనంపై స్వామివారు

మోహిని అలంకరణలో చంద్రప్రభ వాహనంపై స్వామివారు

సమ్మోహినీరూపుడై...

- సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై తిరు వీధుల్లో విహరించిన శ్రీవారు
- వైభవంగా అష్టోత్తర శతకలశాభిషేకం
- స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందిన అశేష భక్తజనం
- వాడపల్లిలో ఆరో రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆత్రేయపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన బుధవారం వేకువజామున సుప్రభాత సేవ, నవనీత హారతిలతో స్వామివారిని మేల్కొల్పారు. అనంతరం వసంత మండపంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వేదిక వద్దకు ఉత్సవమూర్తులను తోడ్కొనివచ్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శతకలశాభిషేకం, హోమాలను వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 10.34 గంటలకు శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకుని తరించారు. కేరళ వాయిద్యాలు, కథాకళి, నాగాలాండ్ కళాకారుల వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమం, శ్రీలక్ష్మీవేంకటేశ్వర మూలమంత్రపూర్వక వేంకటేశ్వరస్వామి హోమాలను కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 7.10 గంటలకు మోహిని అలంకరణలో శ్రీవారు చంద్రప్రభ వాహనంపై అధిష్ఠించి తిరువీధుల్లో విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని కనులారా చూసి తన్మయత్వం పొందారు. వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్న చైర్మన్ వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు సూర్యచక్రధరరావు దంపతులు



చంద్ర ప్రభ వాహన సేవను తిలకిస్తున్న అశేష భక్తజనం



భక్తులకు వీనులవిందు చేసిన నాగాలాండ్ కళాకారుల వాయిద్య ప్రదర్శన

వసుధైక కుటుంబంతో ప్రపంచ సమగ్రత

'గెయిల్' చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ రావు.. ఎస్‌కేవీటీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ రావు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ తాత్వికతలోని వసుధైక కుటుంబ సూత్రం ప్రపంచ సమగ్రతకు మార్గదర్శి అని గెయిల్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్‌రావు అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనం ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఒక నిధి' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీఎస్ రావు మాట్లాడుతూ భారతీయ జ్ఞాన పునరుజ్జీవనమే సమగ్రశాంతికి, సమతుల్యతకు, నిజమైన నిధులు అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గెయిల్ ఇండియా డివిజనల్ మేనేజర్ హెచ్‌ఆర్ దివి ప్రభాకర్‌తో పాటు ఖగోళశాస్త్రంపై చీమలమర్రి శ్రీనివాసరావు, నాట్యశాస్త్రంపై సప్పా దుర్గా ప్రసాద్, ఆయుర్వేదంపై సూర్యరఘురాం, వివిధ అంశాలపై పలువురు ప్రముఖులు మాట్లాడారు. ఈ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధకులు, ఆధ్యాత్మికవేత్తలు, తమ అభిప్రాయాలను, 125 గోష్ఠిపత్రాలను సమర్పించారు. ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణశ్రీ, అధ్యాపకులు పసుపులేటి శ్రీరామ్మూర్తి, డీవీ రమణమూర్తి, పీవీబీ సంజీవరావు, మధులత, లలిత రమ్య శిల్ప పాల్గొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కొవ్వూరులో హాల్ట్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ (నెం.17219/17220), విశాఖపట్నం-కడప ఎక్స్‌ప్రెస్ (నెం.18521/18522) రైళ్లకు కొవ్వూరు స్టేషన్‌లో హాల్టు ఇచ్చేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రాసిన లేఖకు రైల్వే అధికారులు స్పందించి సమాచారం అందిస్తూ, త్వరలోనే ఇది అమల్లోకి వస్తుందని తెలిపారు. కొవ్వూరు, పరిసర ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ రెండు రైళ్లు కొవ్వూరులో ఆపాలని ఎంపీ పురందేశ్వరి చేసిన కృషి ఫలించిందని రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అధ్యక్షతన బుధవారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు,చార్జిషీట్లు ఫైల్ చేసే సమయంలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై సూచనలు చేశారు. బెయిల్/ జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగు సిఫార్సులు చేశారు. డీఎల్ఎస్ఏ కార్యాచరణ, బాధితుల పరిహార కేసులపై చర్చించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి ఆదాయం రూ.24.72 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ద్రాక్షారామ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలోని శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. జూలై 5 నుంచి అక్టోబరు 15 వరకు 102 రోజులకుగాను ఆలయంలోని హుండీల ద్వారా రూ.24,72,056 ఆదాయం లభించింది. బంగారం 2.200మిల్లీగ్రాములు, వెండి 99 గ్రాములు వచ్చింది. అన్నదాన హుండీ ద్వారా రూ.1,64,675 వచ్చినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభానీ విలేఖరులకు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో, రామచంద్రపురం డివిజన్ తనిఖీదారు బాలాజీరామ్‌ప్రసాద్, గంగవరం టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి వి.బాలకృష్ణ, వెల్ల గ్రూపు ఈవో వైవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన జరిగిన ఈ కార్యక్రమంలో పెంకె సాంబశివరావు, ఆళ్ల బుజ్జి, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటితో రోగాలు దూరం

విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందిస్తే కొన్ని రోగాలు దరిచేరవని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ కేఎస్వీ ప్రసాదరావు అన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని విస్తరణ శిక్షణా కేంద్రం అవరణలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలకు, డిప్యూటీ ఎంపీడీవోలకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు 8వ బ్యాచ్ ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రసాదరావు శిక్షణార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అబ్దుల్ మదీనా, విశ్రాంత ఎస్ఈలు ఉమాశంకర్, శ్రీనివాసు, డీఈఈ స్వామి, డీఎల్పీవో అమ్మామణి, సీనియర్ ఫ్యాకల్టీ శేషుబాబు పాల్గొన్నారు.

కాకినాడ జీజీహెచ్‌లో బెరా యూనిట్ ప్రారంభం



జీజీహెచ్‌లో బెరా యూనిట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ లావణ్య

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లోని ఈఎన్‌టీ విభాగంలో బ్రెయిన్‌స్టెమ్ ఇవోక్డ్ రెస్పాన్స్ ఆడియో మెట్రీ యూనిట్(బెరా)తో పాటు నూతనంగా పునరుద్ధరించిన సౌండ్ ప్రూఫ్ ఆడియో మెట్రీ గదిని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెరా పరీక్ష.. విషయపరంగా ఆధారపడని(ఆబ్జెక్టివ్) శ్రవణ పరీక్షా విధానమన్నారు. ఇది చెవిలో నుంచి మెదడు వరకు ఉన్న శ్రవణ మార్గం స్పందనలను నమోదు చేస్తుందన్నారు. ఈ పరీక్ష నవజాత శిశువులు, పిల్లలు, మానసిక వెనుకబాటు ఉన్నవారు అలాగే సహకరించలేని రోగుల్లో వినికిడి స్థాయిని అంచనా వేసేందుకు ఉపయోగకరమన్నారు. ఇది మాలింగ రింగ్ (నకిలీ వినికిడి లోపం) గుర్తించడంలో, మెడికో లీగల్ అలాగే దివ్యాంగుల అంచనా సందర్భాల్లో వినికిడి పరిమితులను కచ్చితంగా నిర్ధారించడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ పి.విజయదీప్తి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మోహర్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య పాల్గొన్నారు.

కొడుకులను కడతేర్చి.. తాను అంతమై..

- ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి
- ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో కలకలం రేపిన సంఘటన
- ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో
- బంధువుల వేధింపులే కారణమని ప్రస్తావన



మరణించిన కామరాజు, కుమారులు అభిరామ్, గౌతమ్ (ఫైల్)

ఆలమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో బుధవారం తెల్లవారుజామున ఓ తండ్రి తన కుమారులను చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.

అసలేం జరిగిందంటే...

చిలకలపాడుకు చెందిన పావులూరి కామరాజు అలియాస్ చంటి (36) సెలూన్ షాపు నిర్వహిస్తూ తన కుమారులు అభిరామ్(11), గౌతమ్ (8)తో కలసి జీవిస్తున్నాడు. అభిరామ్ ఐదో తరగతి, గౌతమ్ ఒకటో తరగతి మడికిలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. అయితే నాలుగేళ్ల క్రితం కామరాజు భార్య పావులూరి నాగలక్ష్మి ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. బుధవారం తెల్లవారుజామున తన కుమారులు ఇద్దరికి కూల్‌డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చిన తదుపరి కామరాజు ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని బంధువులు గుర్తించి ఆలమూరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్, సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు. అయితే చిన్నారులు అభిరామ్, గౌతమ్ మృతిచెందిన విధానంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారి నోటి నుంచి ఎటువంటి నురగలు రాకపోవడంతోపాటు ఎక్కడ పడుకున్నవారు అక్కడ ఉన్నారు.. విషం తాగిస్తే అలా పడుకుని ఉండలేరని వాదన ఉండడంతో పూర్తిస్థాయి విచారణ చేయాలని క్లూస్ టీమ్, ఎఫ్ఎస్ఎల్ టీమ్‌లను రప్పించి వివరాలు సేకరించారు. ఈ మేరకు ఆలమూరు ఎస్ ఐ జినరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అభిరామ్, గౌతమ్ మృతదేహాలు

సెల్ఫీ వీడియో...

కామరాజు ఆత్మహత్య చేసుకునే ముందు చేసిన సెల్ఫీ వీడియో కీలకంగా మారనుంది. "నా కుమారులు, నేను ఆత్మహత్య చేసుకుని మృతి చెందుతున్నాం.. దీనికి ప్రధాన కారణం నా భార్య సమీప బంధువులైన ముగ్గురు వ్యక్తులు (పేర్లను ప్రస్తావిస్తూ). వారు తరచూ నన్ను వేధింపులకు గురి చేస్తుండడంతో పాటు నన్ను హతమార్చడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా నా తల్లిదండ్రులు, బంధు వులను కూడా దూషిస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు" అని కామరాజు ఆ వీడియోలో పేర్కొన్నాడు. కుమారుడు, మనవుల మృతి పట్ల కామరాజు తల్లితో పాటు బంధువులు విలపించారు.

నాలుగేళ్ల కిత్రం భార్య కూడా..

కామరాజు భార్య నాగలక్ష్మి నాలుగేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. దీంతో మరణానికి కామరాజే కారణమని నాగలక్ష్మి బంధువులు ఆరోపించడంతో అతడిపై ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ప్రస్తుతం కామరాజు తన కుమారులకు చంపి, తాను ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. కుటుంబంలోని నలుగురు ఒకే రకంగా మృతిచెందడంతో సంచలనం కలిగించింది. నలుగురి మరణాలపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

కాకినాడలో రెండు స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ రద్దు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని రెండు స్కానింగ్ సెంటర్లపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వాటి పీసీ అండ్ పిఎన్‌డిటి యాక్ట్ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసినట్టు కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జన్మభూమి పార్క్ సమీపంలోని యూఎస్ ఉమెన్ కేర్ ఫెర్టిలిటి క్లినిక్, అలాగే నూకాలమ్మ గుడి సమీపంలోని వెంకటేశ్వర స్కాన్ సెంటర్ పీసీ అండ్ పిఎన్‌డిటి యాక్ట్ రిజిస్ట్రేషన్ల రద్దు ఈ నెల 14వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని డీఎంహెచ్‌వో తెలిపారు. కాకినాడ జిల్లాలో చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి స్కానింగ్ కేంద్రాల సమాచారం లేదా నమోదు కాని స్కానింగ్ కేంద్రాలు అలాగే అర్హత లేని వైద్యుల వివరాలు టోల్ ఫ్రీ నెంబర్ (1800 4253365) లేదా వాట్సప్ నెంబర్ 9494 113365కు గాని తెలియపర్చినచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మహ్మద్ జాఫర్ (ఫైల్)

గోపాలపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనుకనుంచి వస్తున్న గూడ్స్ లారీ ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం శివారున బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పి.మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు పట్టణానికి చెందిన మహ్మద్ జాఫర్ (41) సమిశ్రగూడెంలో గతంలో వర్క్స్ షాపులో పనిచేసేవాడు. అయితే 3 నెలల క్రితం కంచర్లగూడెం-జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న ఓంకార్ ఫెర్టిలైజర్ కంపెనీలో ఫిట్టరుగా చేరాడు. బుధవారం సాయంత్రం గోపాలపురం నుంచి ఫ్యాక్టరీ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న గూడ్స్ లారీ ఢీకొనడంతో జాఫర్ అక్కడిక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన గూడ్స్ లారీ ఆగకుండా వెళ్లిపోగా వెంబడించి మెట్ట వద్ద డ్రైవర్‌తో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మనోహర్ తెలియజేశారు.

ఏపీ ఉమ్మడిగా ఉంటేనే బాగుండేది..



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

- కలిసున్నప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- విభజన తర్వాత తెలుగు రాష్ట్రాల స్థానమేంటో చూడండి
- పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలి : ఉమ్మడి ఏపీ చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడిగా ఉంటేనే బాగుండేదని.. తాను ఇప్పటికీ అదే కోరుకుంటున్నానని ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి, ప్రస్తుత బీజేపీ నేత ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో ఉండేదని, కానీ.. విభజన తర్వాత ఈ రెండు రాష్ట్రాలు ఏ స్థానాల్లో ఉన్నాయో చూడాలని వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కలసి ఉంటే కలదు సుఖం. అందుకే తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగానే ఉండాలని కోరుకున్నాను. అలా ఉంటేనే బాగుండేది. ఇప్పటికీ నేను అదే మాటపై ఉన్నాను' అని అన్నారు. పోలవరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దాని వల్ల 7.2 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని, 23 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం తన హయాంలోనే టెండర్లు పిలిచానని గుర్తుచేశారు. కృష్ణా జలాలపై 1976 బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 811 టీఎంసీల నీటిని ఉమ్మడి ఏపీ వాడుకోవచ్చని చెప్పారు. కానీ, ట్రిబ్యునల్ ఆర్డర్‌ను పునఃపరిశీలన చేయాలని తెలంగాణ అడుగుతోందని, దీనిపై మన ప్రభుత్వం కూడా స్పందించాలన్నారు. తాను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడానని.. నీరు ఉన్నప్పుడు పర్వాలేదు కానీ నీరు లేనప్పుడు సమస్య ఉత్పన్నమవుతుందని చెప్పానని అన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇద్దరూ కలసికట్టుగా ఆలోచన చేసి ఈ విషయంలో కోర్టులో గెలవడం ముఖ్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం బాగా పనిచేస్తోందని, అయితే మరింత వేగం అవసరమని అన్నారు. ప్రధాని మోదీ కూడా రాష్ట్రానికి సహకారం అందిస్తున్నారని, ఇది మరింత పెరగాలని చెప్పారు. లిక్కర్ స్కామ్‌లో నిందితుడుగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని ఐక్యరాజసమితి సమావేశాలకు పంపడంపై కిరణ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ... పార్లమెంట్ వేరు, కేంద్రం వేరని.. న్యాయశాస్త్రం ప్రకారం శిక్ష పడేవరకూ ఎవరినీ దోషి అనలేమని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లంచాల 'రెవెన్యూ'.. అదే మహా'ప్రసాదం'!

- సర్టిఫికెట్ కావాలంటే సొమ్ములు చెల్లించాల్సిందే
- ఎఫ్‌లైన్ సర్వేకు రూ.లక్ష డిమాండ్
- అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న లంచాల బాగోతం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- తాజాగా అమలాపురంలో రూ.50వేలు లంచంతో పట్టుబడ్డ తహశీల్దార్, డేటా ఎంట్రీ ఆపరేటర్



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము

అమలాపురం/అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పారదర్శకంగా పౌర సేవలు అందిస్తున్నట్టు ప్రకటిస్తున్నప్పటికీ ఆ సేవలను పొందాలనుకునే ప్రజలు మాత్రం రెవెన్యూ అధికారులకు భారీగా లంచాలు సమర్పించుకుంటే గానీ పని ముందుకు వెళ్లడం లేదు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా దానికో రేటు నిర్ణయిస్తున్నారు. ఆ రేటుతో ఏ రూటులో వెళ్లాలో కూడా కిందిస్థాయి రెవెన్యూ యంత్రాంగమే సలహాలు, సూచనలు ఇవ్వడం ద్వారా రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న చిరుద్యోగుల నుంచి తహశీల్దార్ల వరకు భారీగా అవినీతికి పాల్పడుతున్నారు. ఇటీవల విద్యా సంవత్సరం ప్రారంభసమయంలో ఈడబ్ల్యూసీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నవారి నుంచి భారీగా సొమ్ములు వసూలు చేశారు. ఇది ఒక కోనసీమ జిల్లా అమలాపురంలోనే కాదు అన్ని కేంద్రాల్లోను ఈ తరహా దోపిడీ కొనసాగుతూనే ఉంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలు శూన్యం. కాగా అమలాపురం తహశీల్దార్ కార్యాలయం కేంద్రంగా సర్టిఫికెట్‌కు రూ.2వేలు లంచం ఇస్తే తప్ప డిజిటల్ సైన్ పడేది కాదు. కార్యాలయాల్లో పని చేసే చిరుద్యోగులనే కలెక్షన్ ఏజెంట్లుగా పెట్టుకుని వసూళ్ల దందా కొనసాగించారనడానికి బుధవారం కోనసీమ జిల్లా అమలాపురం తహశీల్దార్ కేంద్రంలో జరిగిన ఏసీబీ రైడే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, కలెక్షన్ ఏజెంట్‌గా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ రాములు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని రాజోలు ప్రాంతానికి చెందిన గంధం దుర్గాకొండలరావు నుంచి భూమి సర్వే నిమితం రూ.50వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. లంచం సొమ్ముతో పాటు అదనంగా కార్యాలయంలో రూ.5.85 లక్షల సొమ్మును కూడా ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఈ సొమ్ము కూడా భూముల సర్వే నిమిత్తం బుధవారం వచ్చిన కలెక్షనే అంటూ ప్రచారం జరుగుతుంది. రెవెన్యూశాఖలో డెత్ సర్టిఫికెట్లు, భూముల మ్యూటేషన్, భూముల సర్వే, రీసర్వేలు, వీటితో పాటు ప్రభుత్వం ఇచ్చే వివిధ రకాల సర్టిఫికెట్లు, ఇలా ప్రతీ పనికి ఒక రేటు పెట్టుకుని సొమ్ములు చేసుకుంటున్నారనే ఆరోపణలు జిల్లావ్యాప్తంగా వినిపిస్తున్నాయి. పైగా ఇటీవలే తహశీల్దార్ అశోక్‌ప్రసాద్ ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమలాపురం డివిజన్ అధ్యక్షుడిగా కూడా ఎన్నికయ్యారు. అంతటి హోదాలో ఉండి అడ్డూ అదుపు లేకుండా లంచాల దందాలను కొనసాగిస్తున్నారనే విమర్శలు తహశీల్దార్ కార్యాలయం కేంద్రం గత కొన్ని నెలల నుంచి వెల్లువెత్తుతున్నప్పటికీ ఏ ఒక్క ఉన్నతాధికారి స్పందిండం లేదనే విమర్శలు ప్రజల నుంచి బాహటంగా వ్యక్తమవుతున్నాయి.

కనీస స్పందన ఏది..?

జిల్లా కేంద్రంగా ఉన్న అమలాపురంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వోతో సహా ఎంతో మంది ఉన్నతాధికారులు ఉన్నా ఏనాడు తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేసి అక్కడే వేచి ఉండే ప్రజల్ని అడిగితే లంచాల మాటున సాగే ఎన్నో యథార్థాలు సాక్షాత్కరించేవని ప్రజలు బాహటంగా చెబుతున్నారు. ఇటీవల ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి సచివాలయం-3లో కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీమన్నారాయణ అనే వీఆర్వో మ్యూటేషన్ నిమిత్తం రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అయితే ఆ సమయంలో అసలు సూత్రధారులను పక్కకు తప్పించడంలో కొందరు ఉద్యోగులు సహకరించారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇలా కోనసీమ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో మామూళ్ల దందాలు పేట్రేగిపోతున్నప్పటికీ ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కనీసం స్పందించకపోవడంతో మరింత రెచ్చిపోయి దందాలను యథేచ్ఛగానే కొనసాగిస్తున్నారనడానికి అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన భారీ అవినీతే అద్దం పడుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా కార్యాలయంలో అదనంగా దొరికిన రూ.5.88లక్షలు నగదు ఎక్కడదనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీసే క్రమంలో కామనగరువు లేఅవుట్‌లో ఉంటున్న తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఇంట్లో ఏసీబీ అధికారులు బుధవారం రాత్రి సోదాలు కొనసాగిస్తున్నారు. కాగా రెవెన్యూ అధికారుల అవినీతి అమలాపురం కేంద్రంగా బట్టబయలు కావడంతో మిగిలిన ప్రాంతాల్లో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సమాచారం.

ఇదీ తహశీల్దార్ అవినీతి బాగోతం...

15 సెంట్ల భూమి ఎఫ్‌లైన్ సర్వేకు అమలాపురం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ రూ.లక్ష డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని అదే కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాము రూ.50వేలుకు సెటిల్ చేశారు. బుధవారం సాయంత్రం అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో రూ.50వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు నేరుగా దాడి చేసి పట్టుకున్నారు. దాడి సమయంలో తహశీల్దార్ కార్యాలయంలో అదనంగా లెక్కలు చూపని రూ.5,88,500 నగదు ఉండడాన్ని గుర్తించారు. రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రాజమహేంద్రవరం సమీపంలోని రాజవోలు గ్రామానికి చెందిన గంధం దుర్గాకొండలరావుకు అమలాపురంలో 15 సెంట్ల స్థలం ఉంది. కొండలరావు తండ్రి వెంకటసత్యనారాయణ 1995లో 15 సెంట్ల స్థలాన్ని కొనుగోలుచేసి ఉంచారు. ప్రస్తుతం తండ్రి సత్యనారాయణ ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉండడంతో ఆ స్థలాన్ని విక్రయించి వైద్యం చేయించుకోవాలని కొండలరావు కుటుంబం భావించింది. అయితే ఆ భూమిని విక్రయించేందుకు ఎఫ్‌లైన్ సర్వే తప్పనిసరిగా చేయించుకోవాల్సి ఉంది. దాంతో కొండలరావు అమలాపురం తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు. ఎఫ్‌లైన్ సర్వే చేయాలంటే రూ.లక్ష చెల్లించాలని తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ డిమాండ్ చేసినట్టు తెలిపారు. అయితే ఈ వ్యవహారాన్ని అదే కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాము రూ.50వేలుకు సెటిల్ చేశారు. అయితే అంత మొత్తాన్ని ఇచ్చేందుకు మనస్కరించని కొండలరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దాంతో బుధవారం సాయంత్రం అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో కొండలరావు రూ.50వేలు నగదు అందజేస్తుండగా ముందస్తు వ్యూహంతో ఉన్న ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే తహశీల్దార్ కార్యాలయంలో అక్కౌంటెంట్ క్యాష్ రూ.5,88,500 ఉండడాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. లంచంగా ఇచ్చిన రూ.50వేలు నగదుతో పాటు మొత్తం రూ.6,38,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. లెక్క చూపకుండా ఉన్న నగదు ఎలా వచ్చిందో విచారణలో తేలుస్తామన్నారు. రామును తహశీల్దార్ కార్యాలయంలో కస్టడీలో ఉంచి తహశీల్దార్ అశోక్‌ప్రసాద్‌ను సమీపంలోనే ఉన్న ఆయన ఇంటి వద్దకు ఏసీబీ అధికారులు తీసుకువెళ్లారు. అశోక్‌ప్రసాద్, రాములను జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపిస్తున్నట్టు డీఎస్పీ కిశోర్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డివిజన్‌శాఖ అధ్యక్షుడిగా తహశీల్దార్ అశోక్‌ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'అడపా అప్పారావు మరణం తీరని లోటు'



అడపా అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

అమలాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు పత్రికా రంగంలో జర్నలిస్టుగా విశిష్ట సేవలందించిన అడపా అప్పారావు మరణం పాత్రికేయులు, ప్రజలకు తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెం గ్రామంలోని అప్పారావు స్వగృహం వద్ద బుధవారం మధ్యాహ్నం సీనియర్ జర్నలిస్టు కాట్నం వెంకటరత్నం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. అప్పారావు పాత్రికేయుడిగా పనిచేసిన కాలంలో ఎందరో జర్నలిస్టులను ఫీల్డులోకి తీసుకువచ్చిన వ్యక్తి అని కొనియాడారు. అప్పారావు పేరిట స్మారకార్థం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడంతో పాటు ఆయన విగ్రహాన్ని రూపొందింపచేసి ప్రతిష్ఠింపచేయాలని వక్తలు సూచించారు. జర్నలిస్టుగా ఐదు దశాబ్దాల పాటు పని చేసిన అప్పారావు లేనిలోటు జర్నలిస్టులకు తీరనిదని పలువురు పేర్కొన్నారు. తొలుత అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రజ్యోతి సంస్థ రాజమహేంద్రవరం బ్రాంచి మేనేజర్ సిద్ధిరెడ్డి శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్‌కు చెందిన పారుపల్లి శ్రీధర్, జర్నలిస్టు నేతలు మండేల శ్రీరామమూర్తి, కటికిరెడ్డి శ్రీరామారావు (బాబాయ్), నిమ్మకాయల సతీష్, ఆచంట వెంకట్, నాయకులు రంకిరెడ్డి సూర్యనారాయణ, ఉంగరాల బూరిబాబు, తాడి నరసింహారావు, కాకినాడకు చెందిన ఏలియా, డిల్లీకి చెందిన శర్మ, ప్రవీణ్, అనేకమంది ప్రముఖులు, మేధావులు అప్పారావు సేవల్ని కొనియాడారు.

ప్రతి ఒక్కరికీ పరిహారమివ్వాలి

- కదం తొక్కిన పోలవరం నిర్వాసితులు
- ర్యాలీగా తరలివచ్చి ఐటీడీఏ ముట్టడి
- సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అల్లూరి జిల్లా కలెక్టర్ హామీ



చింతూరు ఐటీడీఏ ముందు నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

చింతూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విలీన మండలాల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఒక్కటయ్యారు. ముంపు గ్రామాలన్నింటికీ 2013 భూసేకరణ ప్రకారం ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ పరిహారంతోపాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించాలని లోతట్టువాసులు బుధవారం ర్యాలీగా తరలివచ్చి చింతూరు ఐటీడీఏని ముట్టడించారు. విలీన మండలాలైన మల్లెతోట, గుర్రంపేట, రామవరం తదితర గ్రామాల నిర్వాసితులు పెద్దసంఖ్యలో వచ్చారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో తాము ఏటా పడుతున్న వెతలు ఏకరవు పెట్టారు. ఈ కష్టాలు భరించలేకపోతున్నామని, తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని నిరసన తెలిపారు. వరదల సమయంలో రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకుని తిండికి నోచుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఊర్ల చుట్టూ వరద నీరు ఉండడంతో రోగమొచ్చినా ఆసుపత్రికి వెళ్లే దిక్కు లేకుండాపోతుందన్నారు. ముంపు గ్రామాలన్నింటినీ గుర్తించి 2013 భూసేకరణ మేరకు నష్ట పరిహారం, ఆర్‌అండ్ఆర్ పరిహారం, 18 ఏళ్లు నిండిన వారికి పరిహారం, పున రావాసంతోపాటు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. గతంలో రూ.1.15 లక్షల పరిహారం తీసుకున్న భూములకు కూడా 2013 భూసేకరణ వర్తించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా కలెక్టర్ తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని నిర్వాసితులు పట్టుబట్టారు. ఈక్రమంలో ఐటీడీఏలో గ్రీవెన్స్ కార్యక్రమంలో ఉన్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వాసితుల దగ్గరకు వచ్చి మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు దగ్గరుండి చూస్తున్నామని, ప్రతీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఇప్పటి వరకు ప్రకటించిన ముంపు గ్రామాల కంటే అదనంగా మరికొన్ని గ్రామాలు కూడా ముంపుకు గురవుతున్న విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అందరికీ న్యాయం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

26న యానాంలో సాహితీ పురస్కారాల ప్రదాన సభ

యానాం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ యానాం ప్రతీఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే శిఖామణీ సాహితీ పురస్కారాల ప్రదాన సభ, కవిసంధ్య దశాబ్ది ఉత్సవం ఈనెల 26న యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో జరగనుంది. శిఖామణీ జీవన సాఫల్య పురస్కారం ప్రముఖ కవి, రచయిత, సాహిత్య అకాడమీ పురస్కారాల గ్రహీత పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్.. యువ పురస్కారం ప్రముఖ కవి, విమర్శకుడు అవధానుల మణిబాబు అందుకోనున్నారు. కవిసంధ్య అధ్యక్షుడు కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే, తెలుగుభాషా సంస్కృతుల ప్రేమికుడు మండలి బుద్ధ ప్రసాద్, ప్రముఖ పద్యకవి ఆజోవిభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, ప్రముఖకవి రచయిత దాట్ల దేవదానం రాజు, ప్రముఖ సాహితీవేత్తలు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ కాళ్ళకూరి శైలజ, బొల్లోజుబాబా, కుంచే నాగసత్యనారాయణ, సీహెచ్‌రాం, డాక్టర్ గూటం స్వామి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కవిసంధ్య- ఆరుద్ర, బైరాగి శత జయంతి సంచిక ఆవిష్కరణ జరగనుంది.

కవిసంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే..

సుమారు 10మందికి (వచన, అభ్యుదయ, పత్రికా, లఘుకవిత, దళిత సాహిత్యం) ముఖ్య అతిథుల చేతులమీదుగా కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారిలో డాక్టర్ కోటేశ్వరారావు, ఎస్.ఆర్.పృథ్వీ, పీఆర్ఎల్.స్వామి, బీహెచ్‌వి.మంగేష్, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, పచ్చిమాల శివనాగరాజు, పుప్పాల సూర్యకుమారి, పోనుగుమట్ల అశోక్‌కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్‌లు ఉన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ముగిసిన శాంతిహోమం

మంత్రజలాలతో సంప్రోక్షణ



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో లోకకల్యాణార్థం చేపట్టిన శాంతిహోమం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. ఉదయం నుంచి పండితులు పంచగవ్య ప్రాశన, మూన్యుసూక్తపారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 11గంటలకు ప్రధానార్చకులు కొట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితులు మహదాశీర్వచనం గావించారు. హోమ పూర్ణాహుతి అనంతరం 3రోజులుగా చేపట్టిన పూజాదికాలు, మంత్రాలతో పవిత్రత పొందిన జలాలతో స్వామి ప్రధానాలయం, యంత్రాలయంతో పాటుగా ఆలయ ప్రాంగణమంతా సంప్రోక్షణ గావించారు. ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రజలాలతో ఆలయమంతా సంప్రోక్షణ చేస్తున్న పండితులు

అక్రమంగా రవాణా చేస్తున్న కలప పట్టివేత

అడ్డతీగల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం డి.రామవరం జంక్షన్‌లో మంగళవారం రాత్రి అడ్డతీగల రేంజ్ ఆఫీసర్ షహేన్షాకు బోలేరో వాహనంపై అక్రమంగా కలప రవాణా జరుగుతుందని సమాచారం వచ్చింది. ఆయన సిబ్బందితో కలిసి నిఘా పెట్టారు. వాహనాంలో రాజవొమ్మంగి మండలం సంజీవనగర్‌కు చెందిన బర్లికల రమణబాబు 18 బిళ్ల కర్ర దుక్కలను రవాణా చేస్తుండగా పట్టుకున్నామని రేంజ్ ఆఫీసర్ తెలిపారు. వీటి విలువ రూ.26,355 ఉంటుందని, కేసు నమోదు చేశామన్నారు.



అధికారులు పట్టుకున్న కలప

చాకిరేవులలో 'పల్లెనిద్ర' పాల్గొన్న అల్లూరి కలెక్టర్, రంప ఐటీడీఏ పీవో



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అడ్డతీగల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం చాకిరేవుల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, వీరవరం గ్రామం నుంచి వెదురునగరం వరకు వెళ్లే రహదారి ఏర్పాటు చేయాలని, గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాల ని, వీరవరం నుంచి కొయ్యూరు మధ్యలో కాలువపై వంతెన నిర్మించాలని, కన్నేరువాగుపై రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాలక సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రజలకు తెలిపారు. పల్లె నిద్ర కార్యక్రమం ఎంతో సంతృప్తినిచ్చిందని, జిల్లాలోని గిరిజన ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజలకు నేరుగా చేరే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దొరకయ్య, ఎంపీడీవో ఏవివి కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డి.నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆంధ్ర, తెలంగాణ మనుషులం కలిసే ఉన్నాం



దోకల మురళిని పరామర్శిస్తున్న మహేష్‌కుమార్ గౌడ్

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణ భౌతికంగా విడిపోయినా, మనుషులమంతా కలిసే ఉన్నాం. బంధుత్వాలు, స్నేహాలు అలానే ఉన్నాయి. ఎవరు అధికారంలో ఉన్నా తెలుగు ప్రజలంతా కలసి ఉండాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన తన పాత మిత్రులు మాజీ ఎంపీ హర్షకుమార్,బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డోకల మురళీలను కలిశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు ఖాయమన్నారు. తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్లను సాధిస్తామని, బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై రిజర్వేషన్ల ఆర్డినెన్స్ అడ్డుకున్నాయని, సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందన్నారు. ఏపీ కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందన్నారు.

మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి

గోకవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాదిగల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని ఎంఎస్పీ మండల కమిటీ అధ్యక్షుడు గరబారపు శ్రీనివాస్ అన్నారు. గోకవరం రజకుల కమ్యూనిటీ హాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ,ఎంఈఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసినట్టు బుధవారం ఆయన తెలిపారు. ఎంఎస్పీ మండలాధ్యక్షుడిగా గరబా రపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ములపర్తి నాగేశ్వరరావు, రామవరపు రాజేష్, ప్రధాన కార్యదర్శిగా ములపర్తి భూషణం, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా చాపల సూరిబాబు,ఉపాధ్యక్షులుగా మద్దాల శ్రీను, జగ్గారపు చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా కుందేటి గంగాధర్,ఎంఈఎఫ్ మండలాధ్యక్షుడిగా పైడమళ్ల లక్ష్మణరావు నియమితులైనట్టు శ్రీనివాస్ ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బయ్యవరపు రాజేశ్వరరావు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొమంచిలి వెంకట్రావు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వినోద్ ఆధ్వర్యంలో ఈ కమిటీలు ఏర్పాటైనట్టు పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు పుట్టినరోజు



సోము వీర్రాజుకు కేక్ తినిపిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు పుట్టినరోజును బుధవారం రాజమహేంద్రవరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. వీర్రాజు కేక్ కట్ చేయగా, కిరణ్‌కుమార్ రెడ్డి ఆయనకు తినిపించారు. అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనం చేశారు. పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీర్రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, నాయకులు రేలంగి శ్రీదేవి, యెనుమల రంగబాబు, నర్సిపల్లి హారిక, పరిమి రాధ, మోది సత్తిబాబు, వీరా వీరాంజనేయులు, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణ, గుర్రాల వెంకట్రావు, కాకరాలు పవన్, మద్దిపాటి రజనీ పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో ప్రతీ కుటుంబానికి ఊరట

రాజానగరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో ప్రతి కుటుంబానికి ఊరట లభించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి బుధవారం రాజానగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గుదలతో నిత్యావసర వస్తువులతో పాటు ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తదితర ఉపకరణాల ధరలు తగ్గాయని, దీంతో అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు, నీలపాల అరవరాజు, సంగిత సత్తిబాబు, కొణతం నర్సింహారావు, బైరెత్తి మల్లిబాబు, దేవన నరసింహం పాల్గొన్నారు.



ఆర్టీసీ డ్రైవరు అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణపురం జంక్షన్ వద్ద బుధవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. తుని నుంచి రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్సు వస్తోంది. జంక్షను వద్ద ఇటు నుంచి ఒక ఆటో డ్రైవరు బస్సును గమనించకుండా వేగంగా అవతల రోడ్డులోకి తిరిగాడు.అది గమనించిన బస్సు డ్రైవరు అకస్మాత్తుగా బ్రేకు వేసి బస్సును ఎడమవైపునకు తిప్పాడు. దీంతో బస్సు ఆ ఆటోను, పక్కనే ఉన్న పార్క్ చేసి ఉన్న ఒక బైక్‌ని ఢీకొని ఆగింది. ఆటోలో ఒక్కడే ఉన్న డ్రైవరు రోడ్డుపైకి దూకేశాడు. ఆటో డ్రైవరు నిర్లక్ష్యం అయినప్పటికీ బస్సును ఆపేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.ఈ జంక్షనులో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం

ఆయేషా మసీదు షెడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి



కమిషనర్ రాహుల్‌మీనాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు మాట ఇచ్చాం.. దానిని ఇప్పుడు నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. బుధవారం స్థానిక 43వ వార్డులో ఆయేషా మసీదుకు అవసరమైన షెడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసంలో తొలుత ఈ మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చి నగరంలో మిగిలిన మసీదుల సందర్శన కార్యక్రమాన్ని ప్రారంభించానన్నారు. తాము ఇక్కడ షెడ్డు నిర్మిస్తామని గతంలో మాట ఇచ్చామని, దానికి కట్టుబడి రూ.10 లక్షలతో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్,వి.శంకర్,ముస్లిం నాయకులు చాన్ బాషా, ఎస్కే బషీర్, అస్లాం,ఎండీ బాబాఖాన్, అప్సరీ, రఫీ,ఎండి షాజన్, అహ్మద్ ఉన్నిషా పాల్గొన్నారు.

కమిషనర్‌కు అభినందనలు

నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌మీనాను ఎమ్మెల్యే వాసు మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్ చాంబర్‌లో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. నగరాభివృద్ధి, గోదావరి పుష్కరాలకు చేపట్టాల్సిన పనులపై వారు చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, వివిధ ధార్మిక సంస్థల చైర్మన్లు, పాల్గొని కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిలా ఉండగా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనా జిల్లా ఎస్పీ నరసింహకిషోర్‌ను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు ఎస్పీ అభినందనలు తెలిపారు.

యువజనోత్సవాల్లో గైట్ విద్యార్థుల ప్రతిభ

రాజానగరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సెట్రాజ్ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 14న నిర్వహించిన యువజనోత్సవాల్లో తమ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజు తెలిపారు. బుధవారం మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన 15 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బృందం వివిధ పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఇన్నోవేషన్ ట్రాక్లో షేక్ మోమినా బృందం ద్వితీయ బహుమతిని సాధించగా, పి.సుచిత్ర బృందం జానపద గాన ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించిందన్నారు. సెట్రాజ్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్వీడీఎస్ రామకృష్ణ అవార్డు అందజేశారన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ ధనరాజు, ఏవో మీరా అభినందనలు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు కంబాల చేయూత

రూ.1.10 లక్షలు అందజేత



బాధితులకు చెక్కు అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

కోరుకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోసకాయలపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలను విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. తక్షణమే బాధితులైన జుత్తుగ సుబ్రహ్మణ్యం,వీరలక్ష్మి కుటుంబాలకు రూ.70 వేలు, గరికపాటి సత్తిబాబు, వరలక్ష్మి కుటుంబాలకు రూ.40 వేలు చెక్కులను శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ల శివ రామకృష్ణ, బత్తుల నానాజీ, పెద్దడా వెంకన్నదొర, దేశాల నరేష్, పసల గణేష్, నాగ రమేష్, జాజుల నరసింహమూర్తి,చింతల కన్నారావు, పలకంశెట్టి శ్రీను, దోసపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

ఘనంగా మాజీ రాష్ట్రపతి జయంతి

నాయకులు, అధికారుల నివాళి



రాజమహేంద్రవరంలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ కోమలలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి ప్రముఖ శాస్త్రవేత్త, హైదరాబాద్ స్ట్రెక్టమ్ బయో సైన్సెస్ డైరెక్టర్ ఆర్.నాగేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గణితశాస్త్ర విభాగం, కంప్యూటర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జరిగిన జయంతి సందర్భంగా ఆర్-లాంగ్వేజ్‌పై వర్క్‌షాపు నిర్వహించారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక సీపీ బ్రౌన్ మందిరం ఆధ్వర్యంలో నందం గనిరాజు జంక్షన్‌లోని అబ్దుల్ కలామ్ విగ్రహానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో ఆరోధ్యతి వ్యవస్థాపకురాలు కోసూరి చండీప్రియ మాట్లాడుతూ శాస్త్రవేత్త అయిన అబ్దుల్ కలామ్ రాష్ట్రపతి స్థాయికి ఎదగడం వెనుక ఆయన నిర్విరామ కృషిని, పట్టుదలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. సన్నిధానం శాస్త్రి మాట్లాడుతూ ఆకలి మంటలు అనుభవించి ఎదిగిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలామ్ అని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కేఎల్ భవాని, బిల్డర్ గంగుల భాస్కరరావు, మాదేటి ప్రకాష్, సీహెచ్ భాస్కరశాస్త్రి పాల్గొన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌పీ గంగిరెడ్డి, జీవీఎస్ నాగేశ్వరరావు, పి.సాయి, బీహెచ్ రమాదేవి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, ఎస్‌కె రహమాన్, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బిక్కవోలు: మెళ్లూరు ఉన్నత పాఠశాలలో కలాం చిత్రపటానికి హెచ్‌ఎం జి.లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా ఆయన దేశానికి చేసిన సేవలను వివరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు షరీఫ్, రామారెడ్డి, వెంకటమోహన్, వెంకట్రాజు, వీర్రాజు, కామాక్షి, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా వ్యాపారం మానకుంటే పీడీ యాక్టు

కోరుకొండ ఎక్సైజ్ సీఐ బాలాజీ



సీతానగరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సారా వ్యాపారం, అనధికార మద్యం షాపులు నిర్వహణ మానకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్టు అమలు చేస్తామని కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసబాలాజీ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో 13 సెప్టెంబరు 2024 నుంచి 15 అక్టోబరు 2025 వరకు బెల్ట్‌షాపులపై దాడి చేసి 100 కేసులు నమోదు చేసి 246.9 లీటర్ల మద్యం, 93.66 లీటర్ల బీరు స్వాధీనం చేసుకుని, 102 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. అలాగే 5365 లీటర్ల సారా, 37 వాహనాలను స్వాధీనం చేసుకుని, 1,76,840 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 332 మంది వ్యక్తులను అరెస్టు చేసి, 381 కేసులు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కోరుకొండ స్టేషన్ పరిధిలోని సీతానగరం, కోరుకొండ, గోకవరం మండలాల్లోని అన్ని గ్రామాల్లో సారా నిర్మూలనకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నిందితులను, అనుమానితులను తహశీల్దార్ ఎదుట హాజరు పర్చి బైండోవర్ చేస్తున్నామని, దానిని ఉల్లంఘించిన వారికి రూ.లక్ష అపరాధ రుసుం తహశీల్దార్ విధిస్తారని, అయినా అక్రమ వ్యాపారం కొనసాగించిన వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



రంగంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ డి.సుధ హెచ్చరించారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రంగంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్తీ మద్యం లేదని, 2024లో నిర్వహించిన దాడుల్లో బెల్టుషాపులు నిర్వహించిన 76 మందిపై కేసులు నమోదు చేసి, 1202 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేశామన్నారు. 65 మందిని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసి, నలుగురు బైండోవర్ ఉల్లంఘించినందుకు రూ.33,000 జరిమానా విధించామన్నారు మద్యంషాపులపై నిరంతరం నిఘా ఉంచి ఇన్‌స్పెక్టర్లు గస్తీలు చేస్తూ వినియోగదారులకు నాణ్యమైన మద్యం అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. సురక్ష యాప్‌తో ప్రతీ వినియోగదారుడు తాము షాపులో కొనుగోలు చేసిన బాటిల్స్‌ను స్కేన్ చేసి అధీకృత మద్యం అయినదీ.. లేనిదీ తెలుసుకోవచ్చునన్నారు. బెల్టు షాపులు నిర్వహణపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని ఎక్సైజ్ సీఐ సుధ పేర్కొన్నారు.

రంగంపేటలో యూరియా కొరతలేదు

తెలుగు రైతు మండలాధ్యక్షుడు గోపాలకృష్ణ



రంగంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని తెలుగు రైతు మండలాధ్యక్షుడు మోదుకూరి గోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రైతులకు యూరియా అందటం లేదని, సరఫరా చేయాలని సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తను ఆయన ఖండించారు. వైసీపీ నాయకులు యూరియాపై పూర్తిగా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. మండలంలో వరి 7020 ఎకరాలు, మినుము 2415 ఎకరాలు సాగుచేస్తున్నారన్నారు. ఈ ఏడాది సాగు చేపట్టినప్పటి నుంచి మండలంలో 1380 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించామన్నారు. సొసైటీల ద్వారా 490, ఆర్ఎస్‌కే ద్వారా 230, ప్రైవేటు డీలర్స్ ద్వారా 660 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందిందన్నారు. మరో 150 మెట్రిక్ టన్నులు అందుబాటులోకి తెచ్చి రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: సీఐ సుమంత్



అనపర్తిలో షాపులు ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అనపర్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సుమంత్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాణసంచా విక్రయదారులు, ఫైర్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుమంత్ మాట్లాడుతూ బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలని దుకాణాల వద్ద వాటర్ డ్రమ్ములు, ఇసుక బకెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా విక్రయాలు, నిల్వలు ఉంచొద్దన్నారు. తహశీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 13దుకాణాలకు దరఖాస్తులు అందాయన్నారు. ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ షాపుల వద్ద హెచ్చరిక బోర్డులు తప్పనిసరిగా ఉంచాలన్నారు.అనంతరం అనపర్తి, దుప్పలపూడి, రామవరం, కతుకులూరు గ్రామాల్లో షాపులు ఏర్పాటు చేసే ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, ఎస్ఐ శ్రీనునాయక్ ఉన్నారు.

అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

అనపర్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నేటి యువత దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పులగుర్త జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టీవీ సురేంద్ర అన్నారు. బుధవారం అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన కలామ్ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన కలామ్ దేశ 11వ రాష్ట్రపతిగా విశేష సేవలందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయశ్రీ, దుర్గాప్రసాద్, లక్ష్మీ, రాజేశ్వరి, కుసుమ పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద బుధవారం తపాలా ఉద్యోగులు ధర్నా చేశారు. తపాలా ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న అలిండియా పోస్టల్ ఉద్యోగులు సంఘం కార్యదర్శి ఎస్ఎస్ మహాదేవయ్యను ఉద్యోగం నుంచి అన్యాయంగా తొలగించడాన్ని నిరసిస్తూ డివిజన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యు.రవిప్రకాష్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. బలవంతపు టార్గెట్లను తొలగించాలని, ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వైమర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పి.దుర్గారావు, వైస్ స్వర్ణన్ రాజు, టీవీ రమణ, పి.శ్రీనివాస్, రామచంద్రపురం ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్‌వీ మునేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన టీచర్లకు ఎస్ఆర్‌లు

బిక్కవోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో డీఎస్సీ-2025 ద్వారా నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు బుధవారం ఎస్టీయూ నేతలు సర్వీసు రిజిస్టర్లు (ఎస్ఆర్) బహూకరించారు. బిక్కవోలు, ఇల్లపల్లి, కాపవరం, పందలపాక, ఊలపల్లి, బలభద్రపురం ఉన్నత పాఠశాలల్లో చేరిన వారిని కలసి అందజేశారు.

ముగిసిన అండర్-19 ఉ-షు పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక తుమ్మలావలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల ఉ-షు అండర్ - 19 బాలురు, బాలికల పోటీలు బుధవారంతో ముగిశాయి. ఫైనల్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ బి.జాన్సన్ మెడల్స్ అందజేశారు. విద్యాశాఖ అధికారులు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

కోరుకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడిలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నాగబంధ, ధ్వజశిఖర, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం జరిగింది. పండితులు గ్రామానికి చెందిన కంటే వినయ్‌తేజ సువర్ణ సుప్రియ దంపతులు, నందే సూరిబాబు, గంగాభవాని దంపతులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, అర్చనలు, శాంతి కల్యాణం జరిపారు. స్వామివారిని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అనదాసు సూర్యనారాయణ, ఇతర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు దర్శించుకున్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

కడియం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్రజలను వంచనకు గురిచేసిందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆరోపించారు. బుధవారం కడియంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు యాదల స్టాలిన్ అధ్యక్షతన రచ్చబండ, రాష్ట్ర ప్రభుత్వ కల్తీ మద్యంపై కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేణు మాట్లాడుతూ కూటమి హామీలను నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను ఇంకా మభ్య పెడుతూనే పాలన సాగిస్తోందన్నారు.సమావేశంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాట్ లెవెల్ వన్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



క్యాట్ రెండో దశ పరీక్షకు ఎంపికైన విద్యార్థులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన క్యాట్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్స్ సీహెచ్ సౌజన్య, జి.ప్రసాద్ తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో రాణించిన 156 మందిని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం సురేశ్, ప్రాంతీయాధికారి ఉదయ్‌శంకర్ అభినందించారు. కోఆర్డినేటర్ కిరణ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరం

అనపర్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజాన్ని వణికిస్తూ క్షణాల్లో ప్రాణాలు తీస్తున్న హార్ట్ ఎటాక్ వచ్చిన సందర్భంలో ప్రాణాలను కాపాడేది సీపీఆర్ మాత్రమేనని, దీనిపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది అన్నారు. ప్రపంచ సీపీఆర్ వారోత్సవాల సందర్భంగా బుధవారం గ్రామంలోని ఎస్సీ పేటలో వైద్య సిబ్బంది ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించడమే కాకుండా సీపీఆర్ ఏవిధంగా చేయాలన్న అంశంపై డెమో చూపించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీహెచ్‌వో జి.లోకేశ్వరి, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి

ఐబీఎం ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెలివరీ హెడ్ వికారుద్దీన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వికారుద్దీన్

రాజానగరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికతను వినియోగించి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై యువ ఇంజనీర్లు దృష్టి సారించాలని ఐబీఎం ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెలివరీ హెడ్ వికారుద్దీన్ అన్నారు. జీజీయూతో విద్యాపరమైన అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఐబీఎం సంస్థ బుధవారం విద్యార్థుల కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ప్రొఛాన్సలర్ కె.శశికిరణ్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వికారుద్దీన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సాంకేతిక రంగంలో శరవేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థులు ఉద్యోగ సృష్టికర్తలుగా మారేందుకు ఐబీఎం వివిధ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.కార్యక్రమంలో ఐబీఎం సంస్థ ప్రతినిధి జయశ్రీ పద్మనాభన్, జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్ రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, సీఆర్వో సుమంత్, హెచ్‌వోడీలు బి.సుజాత, ఆర్.తమిళ్‌కోడి పాల్గొన్నారు.



వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో ఆకర్షణగా కేరళ కథాకళి నృత్యం.. (పక్కన) చంద్రప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు దృశ్యం

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 16 అక్టోబరు 2025 | 7



సమ్మోహినీ రూపుడై...

సూర్య ప్రభ, చంద్ర ప్రభ వాహనాలపై తిరు వీధుల్లో విహరించిన శ్రీవారు

వాడపల్లిలో ఆరో రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు

9

చిక్కారు!

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ తహశీల్దార్, డేటా ఆపరేటర్

భూమి సర్వే కోసం రూ.50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ దాడి

కార్యాలయ సోదాల్లో అదనంగా రూ.5.85 లక్షల నగదు స్వాధీనం



- మొయినల్లో

తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము

'ఆయుర్వేదం' ఆగయా!



- కాకినాడకు ఆయుర్వేద కాలేజీ మంజూరు చేసిన కేంద్రం
- రూ.16 కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్న ఆయుష్ శాఖ
- జీపీటీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 50 పడకల ఆసుపత్రిలోనే ఏర్పాటు
- అక్కడే కాలేజీ నిర్మాణానికి రెండెకరాలు కేటాయించాలని కోరిన కేంద్రం
- 8 స్పెషాలిటీ కోర్సుల్లో 50 సీట్లతో మొదలుపెట్టి 100 సీట్ల వరకు అప్‌గ్రేడ్
- ఆయుర్వేద కాలేజీ రాకతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు ఎంతో మేలు
- ప్రస్తుతం రాష్ట్రంలో తిరుపతి, విజయవాడలోనే ఆయుర్వేద కళాశాలలు

కాకినాడ సిగలో మరో వైద్య కళాశాల అందుబాటులోకి రాబోతోంది. ఆయుర్వేద వైద్యానికి డిమాండ్ నెలకొన్న తరుణంలో కాకినాడలో ఆయుర్వేద కాలేజీని మంజూరు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ విభాగానికి సమాచారం అందించింది. రూ.16 కోట్ల వరకు ఖర్చయ్యే కాలేజీ ఏర్పాటుకు రెండెకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కోరింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు ఎంతో మేలు జరగనుంది. ఎంబీబీఎస్ తరహాలోనే నీట్ ద్వారా ఆయుర్వేద కాలేజీలకు అడ్మిషన్ లభిస్తుంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఆయుర్వేద వైద్యానికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. అనేక ముదిరిపోయిన వ్యాధులను సైతం నయం చేస్తుందనే ప్రచారం దీనికి ఉంది. ఈనేపథ్యంలో దేశంలో వేల ఏళ్ల కింద ఉద్భవించిన ఈ వైద్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయుర్వేద ఆసుపత్రులు, కాలేజీలను నిర్వహిస్తోంది. అనేక రకాల వ్యాధులకు ఆయుర్వేద ఆసుపత్రుల్లో ఉచితంగా, నామ మాత్రపు రుసుములతోను చికిత్సలు అందిస్తున్నారు. అందులోభాగంగా కాకినాడకు సైతం ఆయుర్వేద ఆసుపత్రిని కేంద్రం మంజూరుచేసింది. రూ.17 కోట్లతో దీన్ని కాకినాడ జీపీటీ ఆవరణలో 50 పడకల సామర్థ్యంలో నిర్మించారు. ఇక్కడ హోమియో, యోగా, యునానీ, ఆయుర్వేద చికిత్సలు అందించేలా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా నిర్మాణం పూర్తి చేశారు. అయితే దీనికి అవసరమైన వైద్యుల నియామకం పూర్తి కాకపోవడంతో ఇంకా ఇది ప్రారంభం కాలేదు. అయితే ఉమ్మడి జిల్లాకు ఆయుర్వేద కాలేజీ అవసరాన్ని గుర్తించి గతేడాది కూటమి ప్రభుత్వం రాగానే అధికారులు కేంద్రానికి ప్రతిపాదన పంపించారు. కొత్తగా ఆయుర్వేద మెడికల్ కాలేజీలను మంజూరు చేసే అవకాశం ఉండడంతో కాకినాడకు కొత్త కాలేజీ ఇవ్వాలని ప్రతిపాదనల్లో వివరించారు. పైగా ఇక్కడే 50 పడకల ఆయుర్వేద ఆసుపత్రి కూడా ఉన్నందున కాలేజీ కేటాయిస్తే బోధనాసుపత్రిగా ఉపయోగపడుతుందని వివరించారు. అటు రాష్ట్ర ప్రభుత్వం తరపున వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కూడా కేంద్రంలో పలుదఫాలుగా మాట్లాడారు. ఈనేపథ్యంలో అనేక ఉత్తర ప్రత్యుత్తరాల అనంతరం ఎట్టకేలకు కేంద్రం కాకినాడకు ఆయుర్వేద మెడికల్ కాలేజీ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఆయుష్ విభాగం అధికారులకు తాజాగా సమాచారం అందించింది. ఈ కాలేజీ మంజూరైన నేపథ్యంలో కేంద్రం నుంచి రూ.16 కోట్ల వరకు నిధులు మంజూరవనున్నాయి. తొలి విడత కింద రూ.7కోట్ల వరకు ఇవ్వనుంది. అయితే ఈ కాలేజీకి నిర్మించాలంటే రెండెకరాల స్థలం అవసరం. అయితే ప్రస్తుతం నిర్మించిన ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలోనే ఈ భూమి కావాలని కేంద్రం కోరుతోంది. ఈనేపథ్యంలో రెండెకరాల కేటాయింపునకు జిల్లా కలెక్టర్‌ను త్వరలో రాష్ట్ర ఆయుష్ అధికారులు కోరనున్నారు. కాలేజీ, ఆసుపత్రి ఒకే చోట ఉండాల్సిన అవసరాన్ని వివరించనున్నారు.

ఎన్ని ఉపయోగాలో...

ఆయుర్వేద కాలేజీలు రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరుపతి, విజయవాడలో ఉన్నాయి. ఇప్పుడు మూడో కాలేజీ కాకినాడకు మంజూరు చేశారు. అయితే రాజమహేంద్రవరంలో హోమియో కాలేజీ ఉంది. కాకినాడలో ఆయుర్వేద మెడికల్ కాలేజీని కేంద్రం ఏర్పాటు చేస్తోంది. ఈ కాలేజీకి తొలుత యాభై సీట్ల వరకు కేంద్రం అనుమతి ఇచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆ తర్వాత వంద సీట్లకు అప్‌గ్రేడ్ చేసే అవకాశం ఉంది. అచ్చం ఎంబీబీఎస్ తరహాలోనే ఆయుర్వేద మెడికల్ కాలేజీలో సీటు కోసం నీట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. కొత్తగా ఏర్పాటుకానున్న ఆయుర్వేద కాలేజీలో ఎనిమిది వరకు స్పెషలిస్ట్ విభాగాల్లో ఆయుర్వేద విద్యను బోధించనున్నారు. ప్రధానంగా కాయ, శల్యతంత్రం, ప్రసూతి, బాలరోగి, సంహిత, పంచకర్మ, అనాటమీ, ఫిజియాలజీ విభాగాల్లో నాలుగున్నరేళ్ల ఆయుర్వేద విద్యను బోధిస్తారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమి కేటాయింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే టెండర్లు పిలిచి కాలేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఇదిలాఉంటే కాకినాడలో నిర్మాణం కానున్న ఆయుర్వేద కాలేజీ, అనుబంధ ఆసుపత్రి వల్ల ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో అనేకమంది రోగులకు వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం అనేకమంది మొండి వ్యాధులు, ఇతర అనారోగ్యాలకు ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఖర్చు తక్కువ, మంచి ఫలితాలు ఉండడంతో ఆయుర్వేద చికిత్స అందించే పలు ప్రైవేటు ఆసుపత్రులకు సైతం గిరాకీ అధికంగా ఉంటోంది. ఈనేపథ్యంలో కాలేజీ రాకతో అనేకమందికి అతి తక్కువ ఖర్చుతో అనేక దీర్ఘకాలిక, చిన్న చిన్న అనారోగ్యాలకు సైతం చికిత్స అందనుంది.

కాకినాడలో కొత్తగా నిర్మించిన ఆయుర్వేద ఆసుపత్రి





కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాహుల్‌మీనా.. (పైన) కలెక్టర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

ఆర్ఎంసీ కమిషనర్‌గా రాహుల్ మీనా బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా రాహుల్‌మీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన కార్యాలయం ఆవరణలోని అభయ కనకదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యాలయంలోని తన చాంబర్‌కు చేరుకుని కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్‌మీనా మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గోదావరి పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తామన్నారు. అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్ రాహుల్ మీనా స్వస్థలం రాజస్థాన్. ఆయన తండ్రి రామ్‌కిషన్ ఐఆర్ఎస్‌గా చేశారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాహుల్‌మీనాను రాష్ట్ర ప్రభుత్వం రాజమహేంద్రవరం కమిషనర్‌గా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాను నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ ఇన్చార్జి రీటా, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండీ అబ్దుల్‌మాలిక్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌మీనా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను పండించాలి

- కలెక్టర్ కీర్తి చేకూరి



దొమ్మేరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి

కొవ్వూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి, ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను పండించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతు నుంచి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ఎక్కడైన సంస్కరణలు తొలి అడుగుతో సాధ్యం అవుతుందన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో రైతు నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 12 ఎకరాల్లో అరటి, చెరకు, బొప్పాయి, పసుపు, కంద, డ్రాగన్‌ఫ్రూట్, జామ తోటలను సాగుచేయడం అభినందనీయమన్నారు. జిల్లా మొత్తం 43 వేల ఎకరాల్లో 2300 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. అలాగే 18 డ్రోన్ టెక్నాలజీతో 7800 మంది రైతులు 10,600 ఎకరాల్లో కషాయాలు స్ప్రే చేస్తూ పురుగుల మందుల వినియోగాన్ని తగ్గిస్తున్నారన్నారు. ఆవుపేడ, మూత్రం ద్వారా జీవామృతం తయారీ, ముల్చింగ్, లింగాకర్షణ బుట్టల వాడకం పద్ధతులను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా ఉద్యానవన అధికారి ఎన్.మల్లికార్జునరావు, హెచ్‌వోడీ డి.సుధీర్‌కుమార్, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం బి.తాతారావు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో మంత్రి దుర్గేష్, ఐఏఎస్ ఆమ్రపాలి

ఉదయ్‌పూర్ పర్యాటక మీట్‌కు మంత్రి దుర్గేష్ హాజరు

నిడదవోలు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తిరుపతి, విశాఖపట్నాలను త్వరలోనే ప్రపంచ పర్యాటక గమ్యస్థానాలుగా అభివృద్ధి చేస్తామనే కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ హామీ లభించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉదయపూర్‌లో అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల పర్యాటకశాఖ మంత్రులతో రెండోరోజు బుధవారం సమావేశం జరిగింది. దీనికి హాజరైన మంత్రి దుర్గేష్ 'ఆంధ్రజ్యోతి'తో అక్కడి విశేషాలను ఫోనులో చెప్పారు. రాజమండ్రిలో నేషనల్ స్కూల్‌డ్రామా ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రిని కోరినట్టు తెలిపారు.

రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కొవ్వూరులో హాల్టు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ మచిలీపట్నం (నెం.17219/17220), విశాఖపట్నం- కడపకు వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ (నెం. 18521/18522) రైళ్లకు కొవ్వూరు స్టేషన్‌లో హాల్టు ఇచ్చేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈమేరకు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రాసిన లేఖకు రైల్వే అధికారులు స్పందించి సమాచారం అందిస్తూ, త్వరలోనే ఇది అమల్లోకి వస్తుందని తెలిపారు. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజల విజ్ఞప్తిని పురస్కరించుకుని ఈ రైళ్లు కొవ్వూరులో ఆపాలని చేసిన కృషి ఫలించిందని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఎంపీ పురందేశ్వరికి కృతజ్ఞతలు

కొవ్వూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా రెండు ఎక్స్‌ప్రెస్‌ల స్టాపేజీకి రైల్వేశాఖ అనుమతులు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తిరుమల, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టుకు అనుమతులు మంజూరుచేసిందన్నారు. దీనికి సహకరించిన ఎంపీ పురందేశ్వరికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పురందేశ్వరికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు జీజీహెచ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం రాజమహేంద్రవరం జీజీహెచ్ ఉన్నతాధికారులు, అన్ని వైద్య విభాగాల హెచ్‌వోడీలతో శాఖలు, పథకాలవారీగా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఎంసీహెచ్ బ్లాకులోని క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో ఈ సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా కలెక్టర్ శాఖలవారీగా సంబంధిత అధికారులతో సమీక్ష చేస్తారు. సమస్యలు అడిగి తెలుసుకుంటారు. పరిష్కారానికి మార్గనిర్దేశనం చేస్తారు. మెడికల్ కాలేజీ పనులపైనా సమీక్షిస్తారు. మొత్తం 18 అజెండా పాయింట్లను కలెక్టర్ సమీక్ష చేసే అవకాశం ఉంది. పల్మనాలజీ, రేడియాలజీ, సీటీ స్కాన్ విభాగం, ఎన్టీఆర్ వైద్యసేవలో ఇన్‌పేషెంట్ రోగుల వివరాలు, ఎస్ఎన్‌సీయూ తదితర విభాగాల పనితీరుతోపాటు క్రిటికల్ కేర్ బ్లాకు పనుల పురోగతి, ఆన్ గోయింగ్ పనులు సమీక్షిస్తారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ బుధవారం హెచ్ఓడీలు, సంబంధిత వైద్యాధికారులకు అత్యవసర సర్క్యులర్ జారీచేస్తూ అన్ని వివరాలతో హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చారు.



ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ సమ్మిట్-2025 పోస్టర్ విడుదల

రాజమహేంద్రవరంరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్టణం ఆంధ్రా విశ్వవిద్యాలయంలో 'ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2025' జరగనుందని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ తెలిపారు. ఇండస్ట్రియల్ పార్టనర్ షిప్ సమ్మిట్-2025 పోస్టర్‌ను ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ మార్ని వాసుదేవరావు, డీజెడ్ఎం అసెట్ మేనేజర్, డీజెడ్ఎంఈ మేనేజర్ తదితరులతో కలసి జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ నుంచి నవంబరు 15వ తేదీ వరకు చేపట్టవలసిన ఏపీఐఐసీ పరిశ్రమ భాగస్వామ్య డ్రైవ్, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పెట్టుబడి ప్రోత్సాహం డ్రైవ్, ప్లాంటేషన్ డ్రైవ్, పారిశుద్ధ్యం, పరిశుభ్రత డ్రైవ్ తదితర కార్యక్రమాలపై చర్చించారు.

బతుకు చెదిరి.. గూడు వదిలి..





- నగరంలో పెరుగుతున్న నిరాశ్రయులు
- ఇంట్లో పొసగక వీధి బాట
- జీవనోపాధి చేసుకుంటూ కొందరు..
- మరికొందరు యాచకం మాటున నేరాలు
- జిల్లాలో 500 మందికిపైగా రోడ్లపైనే జీవనం



రామహేంద్రవరంలో నిరాశ్రయుల వసతి కేంద్రం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓ వ్యక్తిపేరు ప్రసాదు. నెల్లూరు నుంచి రాజమహేంద్రవరం వచ్చాడు. రాడ్‌బెండింగ్ పని బాగా వచ్చు. ఇంట్లో పొసగక వీధి బాట పట్టాడు. ఇక్కడ పగలు పనికి వెళ్లి రాత్రి వేళల్లో ఫుట్‌పాత్‌లను ఆశ్రయిస్తున్నాడు. ఇలా పేదరికం.. అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులు.. ఉపాధి వెతుక్కుంటూ.. ఇంట్లో సమస్యలు.. ఎవరూ లేని ఒంటరితనం.. వ్యసనాలతో అయినవాళ్లకు దూరం.. చట్టం నుంచి తప్పించుకొని.. ఇలా కారణాలేమైనా రోజురోజుకూ గూడును వదిలి రోడ్డును నమ్ముకొని బతుకులను బరువుగా ఈడుస్తున్న జీవితాలు పెరిగిపోతున్నాయి. రోడ్డు సెంటర్ డివైడర్లు, షాపులు మూత వేసిన తర్వాత అరుగులు, రేవులు, ప్లాట్‌ఫాంలే పరుపులుగా బహిరంగ ప్రదేశాలే నివాసాలుగా ఊపిరిని నిలుపుకొంటున్నారు. భార్యాబిడ్డలు ఉండి కొందరైతే.. ఎవరూలేక మరికొందరు.. అలనాపాలనా చూసేవారు లేక ఇంకొందరు రోడ్లబాట పడుతున్నారు. ఈ సమస్య సామాజికపరంగా ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కొన్ని పరిస్థితుల్లో భార్యాబిడ్డలు ఎంత వెతుకుతున్నా వీళ్ల ఆచూకీ లభించని కేసులు కూడా ఉన్నాయి. ఇక రాజమహేంద్రవరంలో నిరాశ్రయుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతం, పుష్కర్‌ఘాట్, గోదావరి గట్టు, రైల్వే స్టేషను తదితర చోట్ల నిరాశ్రయులు ఉంటున్నారు. వీళ్లలో చాలామంది ఇతర రాష్ట్రాలకు చెందిన వాళ్లు ఉంటారు. భవన నిర్మాణం, పెయింటింగ్, కేటరింగ్ వంటి పనులు చేసుకుంటూ ఉంటున్న వాళ్లు డబ్బులు కాస్త జమ అయిన తర్వాత ఇళ్లకు వెళ్లి వస్తుంటారు. పుణ్యం కోరుకుంటూ ప్రతి రోజూ ఉదయం టిఫిన్ దగ్గర నుంచీ రాత్రి భోజనం వరకూ.. సీజనల్ ఫ్రూట్స్ నుంచి ఈవెనింగ్ స్నాక్స్ వరకూ దాతలు వీరి వద్దకే పట్టుకొచ్చి ఇస్తున్నారు. ఇది హర్షించదగినదే అయినా అధికశాతం మంది ఈ ఉచితాలకి అలవాటుపడి ఏ పనీ చేయకుండా నేరాలకు అలవాటు పడుతున్నారు. నిరాశ్రయుల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు లేదా వారి స్వగ్రామానికి పంపించడానికి పోలీసులకు చేతి చమురు వదులుతోంది. ఈ తంతుకు దాతలు ఎవరూ ముందుకు రావడం లేదు. కొందరు నేరాల బాట పడుతున్నారు. గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. తిండి ఎలాగూ దొరుకుతోంది, పగలంతా యాచించగా వచ్చిన సొమ్ముతో మద్యం తాగుతూ జల్సా చేస్తున్నారు. ఆ మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఘాట్లలో స్నానాలకు వెళ్లిన వాళ్ల బ్యాగులు, సెల్‌ఫోన్లు దొంగిలించడం, ద్విచక్ర వాహనాలు పట్టుకుపోవడం చేస్తున్నారు. ఈ పరిస్థితి పోలీసులకు తలపోటుగా మారింది. వాళ్ల వివరాలు ఎక్కడా నమోదు కాకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగడం లేదు. ఇక్కడ దొంగతనాలు చేసి వేరే ఊళ్లకు వెళ్లిపోతున్నారు. ఇప్పటికే తమపై కేసులు ఉన్నవాళ్లు కూడా నిరాశ్రయుల మాటున చట్టాన్ని తప్పించుకొని తిరుగుతున్నారు. మూడు రోజుల నుంచీ పోలీసులు స్పెషల్ డ్రైవ్ పెడితే ఆశ్చర్యపోయే విషయాలు బయటకు వచ్చాయి. నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్నవాళ్లు, దొంగతనం కేసుల్లోని వాళ్లే కాకుండా మర్డర్ కేసుల్లోని వాళ్లు కూడా ఉన్నారని తెలిసింది. దీంతో పోలీసులు కౌన్సెలింగ్ మొదలు పెట్టారు. ఇప్పటివరకూ 400 మంది నిరాశ్రయులను గుర్తించి వివరాలు తెలుసుకోగా వాళ్లలో 21 మంది పోలీస్ కేసుల్లో ఉన్నవాళ్లు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ పట్టణ జీవనోపాధుల పథకం (మెప్మా) కింద పట్టణ నిరాశ్రయుల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. రాజమహేంద్రవరంలోని పునరావాస కేంద్రాన్ని ఓ స్వచ్ఛంద సంస్థకు నిర్వహణ అప్పగించారు. రాత్రి భోజన ఏర్పాటు ఉంది. ఈ కేంద్రంలో 50 మంది వరకూ ఆశ్రయం పొందే వీలుంది. అయితే నగరంలో కనీసం 400 మంది నిరాశ్రయులు రోడ్లపై ఉన్నారు. కనీసం వీరు పునరావాస కేంద్రంలో ఉంటే కొంతైనా నేరాల సంఖ్య తగ్గుతుంది.

యాచకం మాటున నేరస్తులు

నిరాశ్రయులు, యాచకుల మాటున నేరస్తులు ఉండడం ఆందోళన కలిగించే అంశం. దీనిపై ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. మా సోదాల్లో ద్విచక్ర వాహనాల దొంగ, హత్యాయత్నం కేసులు ఉన్నవాళ్లని గుర్తించాం. ఆయా పోలీస్ స్టేషన్లకు అప్పగించాం. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్లు, నిరుద్యోగులు వంటి వారిని కౌన్సెలింగ్ చేసి వారి స్వగ్రామాలకు పంపించాం.

- ఎస్పీ నరసింహ కిషోర్

శ్మశాన వాటిక దారి ఇలా.. నడిచేదెలా..?

● పేరుకుపోయిన తుప్పలు ● పాదచారులకు తప్పని తిప్పలు


శ్మశానికి వెళ్లే మార్గం దుస్థితి ఇది

చాగల్లు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చాగల్లు శివారు మీనానగరం శ్మశానికి వెళ్లే మార్గం అత్యంత దారుణంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపో వడంతో పాదచారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. పక్కనే ఉన్న చెరువు వర్షం నీరుతో నిండిపోతే ఈ రోడ్డు మీదిగానే ప్రవహిస్తోంది. దీంతో రోడ్డు కాస్త మురుగు కాలువగా మారిపోయింది. అలాగే పరిసర ప్రాంతాల్లోని ఇళ్ల నుంచి వ్యర్థాలను వదిలేస్తున్నారు. మరికొందరు బహిర్భూమికి సైతం ఉపయోగిస్తుండటంతో ఈ మార్గం అధ్వానంగా ఉంది. కాగా, శ్మశానంలోకి కర్మకాండలు నిర్వహించడానికి వెళ్లేటప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పొలాల్లోకి వెళ్లే రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని అన్నివర్గాల ప్రజలకు అత్యంత అవసరమైన శ్మశానం దుస్థితిపై అధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. రోడ్డుకిరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించాలని, మురుగు ప్రవహించే విధంగా కాలువను కాలువలో కలిపే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి : ముప్పిడి


సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యేలు ముప్పిడి, ఆరిమిల్లి

కొవ్వూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో ఈనెల 16న ప్రధాని మోదీ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ జరగనున్న సభను విజయవంతం చేయాలని కొవ్వూరు ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకుడు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీ.విజయనాగేశ్వర్ రెడ్డి కార్యాలయంలో తణుకు ఎమెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించారు. బహిరంగ సభకు వచ్చే కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రవాణా, తాగునీరు, భోజన సదుపాయాల కల్పనపై చర్చించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, బొల్లిన శివనాగేంద్ర, కొడవటి రవి, తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకు యూరియా విక్రయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్

ఉంద్రాజవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పంటకు అవసరం మేరకు యూరియాను విక్రయించాలని కొవ్వూరు వ్యవసాయ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎరువుల డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యానవన పంటలకు మాత్రమే యూరియా అవసరం ఉన్నందున, ఆ పంటల సాగుచేసే రైతులకు డీలర్లు విక్రయించాలని సూచించారు. ఎరువులు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా రైతుకు బిల్లుఇచ్చి ఈపాస్ నందు బయోమెట్రిక్ వేయించాలని చెప్పారు. యూరియాతోపాటు నానోయూరియా లాభాలను రైతులకు వివరించాలన్నారు. యూరియాను మండలంలోని రైతులకు మాత్రమే విక్రయించాలని, వేరే ప్రాంతాలకు విక్రయించకుండా డీలర్లుఅధికారులకు సహకరించాలని ఏడీఏ శ్రీనివాస్ కోరారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్లు అప్‌డేట్‌గా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవో బీ. రాజారావు, సొసైటీ సెక్రటరీలు, ప్రైవేట్ ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

నూతన టీచర్లకు ఎస్ఆర్‌లు బహూకరణ

బిక్కవోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో డీఎస్సీ - 2025 ద్వారా నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు బుధవారం ఎస్టీయూ నేతలు సర్వీసు రిజిస్టర్లు (ఎస్ఆర్) బహూకరించారు. బిక్కవోలు, ఇల్లపల్లి, కాపవరం, పందలపాక, ఊలపల్లి, బలభద్రపురం ఉన్నత పాఠశాలల్లో చేరిన వారిని కలసి అందజేశారు. ఎస్టీయూ నేతలు ఈశ్వరరెడ్డి, జెఎస్‌పీ, శ్రీను, తదితరులు ఉన్నారు.

27న మహా నీరాజనం

● ఆర్డీవో రాణీసుస్మిత ● గోష్పాద క్షేత్రంలో అధికారులతో గోదావరి హారతి ఏర్పాట్లపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీసుస్మిత , ఇతర అధికారులు

కొవ్వూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గోష్పాదక్షేత్రంలో ఈనెల 27వ తేదీన గోదావరిమాతకు టీటీడీ ఆధ్వర్యంలో మహా నీరాజనం సమర్పిస్తున్నట్టు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు.బుధవారం స్థానిక గోష్పాద క్షేత్రంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో గోదావరి హారతి ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం, దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కార్తీకమాసం మొదటి సోమవారం గోష్పాదక్షేత్రంలో టీటీడీ నుంచి తీసుకువచ్చిన ఉత్సవ మూర్తులకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిలకు తితిదే వేదపండితుల ఆధ్వర్యంలో వివిధరకాల పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం అఖండ గోదావరిమాతకు వివిధ రకాల హారతులతో మహానీరాజనం అందజేస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యేలను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. అందువల్ల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్టీ పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల నిర్వహణ, శాంతిభద్రతల నిర్వహణ, ఫైర్ అధికారులు, విద్యుత్, హెల్త్, దేవదాయశాఖ, వారి విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, పట్టణ సీఐ పి.విశ్వం, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎలక్ట్రికల్ ఏడీఈ ఎం.కృష్ణనాయక్, ఏఈ డి.జగదీశ్వరరావు, ఏజీ ఆర్‌బీ ఏఈ జి.మణికంటరాజు, మత్స్యశాఖ ఏడీ దిల్షాద్, అధికారులు, దాస సాహిత్య ప్రాజెక్టు సిబ్బంది కలగర శ్రీనివాస్, నిమ్మగడ్డ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకరపర్రు విద్యుత్ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సీతారామపురం, కాకరపర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ విద్యుత్‌ను యథావిధిగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఘనంగా అబ్దుల్‌కలాం జయంతి


కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

తాళ్లపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పైడిమెట్ట మండల పరిషత్ బేసిక్ పాఠశాలలో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎంఈవో - 2 నెహ్రూజీ హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం దున్నా దుర్గారావు కలాం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ప్రొఫైల్ తయారుచేయండి : ఎస్ఐ

తాళ్లపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో పోలీస్‌శాఖా పరమైన విషయాలతో పాటు గ్రామ ప్రొఫైల్ తయారు చేయాలని ఎస్ఐ టీ. రామకృష సచివాలయ మహిళా పోలీసు సిబ్బందికి సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రైనీ ఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లోని జనాభా, రాజకీయ పార్టీలు, నాయకులు, నేర చరిత్ర కలవారు ఇతర మౌలిక అంశాలను క్షుణ్ణంగా సేకరించి ఆ విషయాలను ప్రత్యేక ఫార్మట్‌లో అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్టు

నిడదవోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమిశ్రగూడెం లోహియానగర్‌లోని ఓ పశువుల షెడ్డులో కొంతమంది మంగళవారం రాత్రి పేకాడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ బాలాజీ సుందరరావు ఆధ్వర్యంలో దాడి చేశారు. ఇందులో 12 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 51,830 నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తాళ్లపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పోచవరంలో బయటకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన 36 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు బుధవారం పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలివి .. గ్రామానికి చెందిన గుర్రాల పోసియ్య ఇంటిలో రహస్యంగా 50 కేజీలు గల 36 బస్తాలు ఉన్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడి జరిపామన్నారు. దాడిలో దొరికిన బస్తాలను స్థానిక రేషన్ డీలర్‌కు అప్పగించి పోసియ్య అనే వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేశామని సివిల్ సప్లై డీటీ దివాకర్ తెలిపారు. ఈ దాడిలో డీఎస్‌వో పార్వతి, ఏఎస్‌వో నాగాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ ... ఒకరి మృతి

గోపాలపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని వెనుకనుంచి వచ్చిన గూడ్స్ లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై పి. మనోహర్ తెలిపిన వివరాలివి.. నిడదవోలు పట్టణానికి చెందిన మహ్మద్ జాఫర్ (41) సమిశ్రగూడెంలో గతంలో వర్క్‌షాపులో పనిచేసేవాడు. కాగా గత మూడు నెలల క్రితం కంచర్లగూడెం-జగన్నాథపురం మధ్య ఉన్న ఓంకార్ ఫెర్టిలైజర్ కంపెనీలో ఫిట్టరుగా జాయిన్ అయినట్టు తెలిపారు. బుధవారం సాయంత్రం గోపాలపురం నుంచి ఫ్యాక్టరీ వైపు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొందన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలిసికట్టుగా విధులు నిర్వహించాలి

పెరవలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామ సచివాలయ ఉద్యోగులు కలిసికట్టుగా విధులు నిర్వహించాలని తహశీల్దార్ నిరంజన్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ సచివాలయ ఉద్యోగులతో మండల కోఆర్డినేటషన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో పారిశుధ్యం, పీజీఆర్‌ఎస్ కాల్స్, వినతులు, క్రమశిక్షణ నియమావళి గురించి వివరించారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గ్రామ స్థాయి ఉద్యోగులు ఏ విధమైన అవకతవలకు పాల్పడరాదని పేర్కొన్నారు. అనంతరం అదే కార్యాలయంలో గ్రామ రెవిన్యూ అధికారుల గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సొసైటీ సెక్రటరీలు, రైస్ మిల్లర్స్‌తోసమావేశం నిర్వహించి ధాన్యం సేకరణపై అవగాహన కల్పించారు. తర్వాత గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్స్, హార్టికల్చరల్ అసిస్టెంట్‌లకు పంట నమోదు ప్రధాన మంత్రి పంటల బీమా పథకం గ్రామ యూనిట్‌గా పంట కోత ప్రయోగాలుపై శిక్షన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమా రాజ్యలక్ష్మి పద్మజ, ఏవో మేరీ కిరణ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొవ్వూరు రైల్వేస్టేషన్‌కు పూర్వ వైభవం తెస్తాం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019 నాటి రైళ్లకు హాల్ట్ కల్పించి మళ్లీ రైల్వేస్టేషన్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషిచేస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ తెలిపారు. స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో బుధవారం రైళ్ల హాల్ట్‌లపై సమావేశం జరిగింది. రాధాకృష్ణ మాట్లాడుతూ కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్ కారణంగా రైళ్ల హాల్ట్‌లను ఆపేశారు. అనంతరం అవి పునరుద్ధరించకపోవడంతో కొవ్వూరు, పోలవరం, గోపాలపురం పరిధిలోని సుమారు 120 గ్రామాలకు పైగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల పోరాటం, కూటమి నాయకులు, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కృషితో 17219- 17220 మచిలీపట్నం - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 18521 -18522 విశాఖపట్నం - కడప (తిరుమల ఎక్స్‌ప్రెస్)ను నిలుపుదల చేస్తున్నట్టు రైల్వేశాఖ ఉత్వర్వులు విడుదల చేసిందన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పిల్లలమర్రి మురళీకృష్ణ, ఎం.రామచంద్రరావు, ఎం. అంజనేయులు, బూసి బెనర్జి, గెల్లా కేశవ, సుబ్బారెడ్డి, కొండపల్లి రత్నసాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ కనబర్చాలి


డాక్టర్ కోదండరామ్‌ను సన్మానిస్తున్న బీఎంపీలు

కొవ్వూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ కనబర్చాలని స్పైన్ సర్జన్ డా.జె.కోదండరామ్ అన్నారు. బీఎంపీ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సన్‌స్టార్ ఆసుపత్రి సహకారంతో కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూరో అండ్ స్పైన్ సర్జరీక్లినికల్ కార్డియాలజీ, క్రిటికల్ కేర్, యూరాలజీ వంటి వైద్య విభాగాలపై వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.ఎన్.సుధాకర్, డా.జె.కోదండరామ్, డా.భాగ్యప్రీతి, డా.కె.హరీష్, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వై.ఎస్.రామకృష్ణ, పి.వి.శ్రీనివాస్, పి.వి.వి.రమేష్, తోట రామాంజనేయులు, కె.మనోహరం, గెల్లా కేశవ, పి.సత్తిరాజు, ఐ.రవిప్రకాష్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన

ఉంద్రాజవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ చేయడం చట్ట వ్యతిరేకమని పీహెచ్‌సీ డాక్టర్ బీ. దుర్గామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో పీసీపీఎన్‌డీటీ (ప్రీ-కాన్సెప్షన్ అండ్ ప్రీ-నాటల్‌డయాగ్నిస్టిక్ టెక్నిక్స్) చట్టం గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 13 తేదీ నుంచి 18 వరకు ఆడ బిడ్డను రక్షించండి.. ఎదగనివ్వండి, చదవనివ్వండి అనే స్లోగన్‌తో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన వివరించారు. సీహెచ్‌వో ఎం. సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీవీఎల్ కుమారి, సూపర్‌వైజర్లు రత్నకుమారి, శ్రీరామ్మూర్తి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

'బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి'


గోపాలపురంలో స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

గోపాలపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను తహశీల్దార్ సాయిప్రసాద్, ఎస్సై మనోహర్, అగ్నిమాపక అధికారి ఎబీఎస్ఎన్ వేణు సంయుక్తంగా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసినా, అక్రమ నిల్వలు ఉంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గోపాలపురంలో 3, దొండపూడిలో 2, కరిచర్లగూడెంలో 1, కొవ్వూరుపాడులో 1, చిట్యాలలో 1, వేళ్లచింతలగూడెంలో 1 షాపులతో కలిసి 9 షాపులకు సంబంధించి నిర్వాహకుల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ హరీష్, తదితరులు ఉన్నారు.

లక్ష్మీపురంలో క్వారీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత


మాట్లాడుతున్న క్వారీ క్రషర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంద్రూ అనిల్

దేవరపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): క్వారీల ఏర్పాటులో ప్రజాజీవనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత పేర్కొన్నారు. లక్ష్మీపురంలో శేషసాయి మెటల్‌కు సంబంధించిన మేడా గంగాధరానికి నాలుగున్నర ఎకరాల్లో క్వారీ అనుమతుల కోసం ప్రజాపర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ శేషసాయి మెటల్ సప్లైస్ క్వారీ ఏర్పాటు చేయడంలో ప్రజలకు, పర్యావరణానికి ఎమైనా ఇబ్బందులున్నాయా అని అడిగారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సభాముఖంగా కానీ, లిఖితపూర్వ కంగా కానీ తెలియజేయాలన్నారు. గ్రామానికి చెందిన నున్నా నాగేశ్వరరావు (చిన్ని) మాట్లాడుతూ పరిసర గ్రామాల్లో క్వారీలు ఎక్కువగా ఉండటం వల్ల అధిక లోడుతో వెళ్లే లారీలతో రోడ్లు పాడైపోతున్నాయని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా క్వారీ అండ్ క్రషర్స్ సంఘం అధ్యక్షుడు ఆంద్రూ అనిల్ మాట్లాడుతూ ప్రస్తుతం క్వారీ క్రషర్స్ సంక్షోభంలో ఉన్నాయని, దాదాపు 20 క్రషర్ల వరకు మూతపడ్డాయన్నారు. అందువల్ల ప్రభుత్వం క్వారీ క్రషర్స్‌కు సబ్సిడీ ఇవ్వాలని, కరెంటు సరఫరాలో కూడా వెసులుబాటు కల్పించాలన్నారు. క్వారీ క్రషర్స్ మీద అనేక వేలమంది జీవనం సాగిస్తున్నారని ఈ క్వారీ క్రషర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని, అను మతుల విషయంలో ఆటంకాలు కలిగించకుండా తక్షణమే అనుమతులు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్ల పరిశ్రమకు మంచిరోజులు వస్తాయనే ఆశతో క్రషర్స్, క్వారీ యాజమా నులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాకినాడ మైనింగ్ అండ్ పర్యావరణ శాఖ ఈఈ ఎంబీఎస్.శంకరరావు, సంఘ నాయకులు క్వారీ క్రషర్స్ సంఘం కార్యదర్శి మధుబాబు, క్వారీ యాజమానులు సూర్యనారా యణరాజు, కంటి పూడి సుబ్బారావు పాల్గొన్నారు.

గూగుల్ రాకతో సర్వతోముఖాభివృద్ధి

● గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



గోపాలపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద డేటా సెంటర్ అయిన గూగుల్ కంపెనీని రాష్ట్రానికి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ సఫలీకృతమయ్యారన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో పనిస్తున్నారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బడా దోస్తు వాహనం ఢీకొని వ్యక్తి గాయపడినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఈనెల 12వ తేదీన దేచర్లకి చెందిన నూకతట్టి భూపతిరావు స్కూటీపై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న బడా దోస్తు వ్యాన్ ఢీకొట్టింది. దీంతో గాయపడిన భూపతిరావును 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

దేవరపల్లి బస్టాండ్‌లో ..

కుక్కలు బాబోయ్ కుక్కలు

దేవరపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్‌లో బుధవారం రాత్రి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఎక్కడికక్కడ గుంపులుగా తిరగటంతో గ్రామస్థులు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందారు. నెలక్రితం స్థానిక పంచాయతీ అధికారులు కొన్ని కుక్కలను పట్టుకుని వేరే ప్రాంతాలకు తరలించినప్పటికీ, మరలా యథావిధిగా ప్రతి వీధిలోనూ, ప్రధాన రహదారిలోనూ దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా ప్రజలను కరవడానికి వెళ్తుండడంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరు కుమారులను చంపి.. తండ్రి ఆత్మహత్య

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో ఘటన
● భార్య ఆత్మహత్య విషయంలో తనను బంధువులు వేధిస్తున్నారని సెల్ఫీ వీడియోలో వెల్లడి

ఆలమూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో ఓ తండ్రి ఇద్దరు కుమారులకు విషమిచ్చి చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. మడికి పంచాయతీ పరిధి చిలకలపాడులో పావులూరి కామరాజు (36) సెలూన్‌షాపు నిర్వహిస్తున్నాడు. అతడికి ఇద్దరు కుమారులు పావులూరి అభిరామ్(11), పావులూరి గౌతమ్(8) ఉన్నారు. నాలుగేళ్ల క్రితం అతడి భార్య నాగలక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. అప్పట్లో ఆమె మృతికి కామరాజే కారణమని ఆరోపణలు రావడంతో అతడిపై ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఈ విషయంలో తన భార్య బంధువులు ముగ్గురు తనను వేధిస్తున్నారని, అవి భరించలేక తన కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుంటున్నామని అతడు సెల్ఫీ వీడియోలో తెలిపాడు. బుధవారం తన కుమారులు ఇద్దరికీ కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలిపి ఇచ్చి చంపాడు. ఆ తర్వాత అతడు ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. ఈ వార్త స్థానికంగా తీవ్ర సంచలనం కలిగించింది. మృతదేహాలను క్లూస్, ఎఫ్ఎస్ఎల్ టీమ్‌లు పరిశీలించాయి. సంఘటనాస్థలంలో మృతదేహాలను కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ పరిశీలించారు.